ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 13-10- 2026 | సంపుటి: 17, సంచిక: 192, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

అసెంబ్లీ ప్రాంగణంలో అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు

బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడిన మహిళలు

పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 12 : బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక అని తెలంగాణ శాసనసభ సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు కొనియాడారు. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం రోజు సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సంబరాల్లో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,

తరువాయి 2వ పేజీలో...

భారత్-జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలు

మరింత బలోపేతం కావాలి

తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

తెలంగాణ-హిరోషిమా మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా రంగాల్లో సహకారం మరింత పెరగాలి : శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



హైదరాబాద్, అక్టోబర్ 12 : ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతానికి అంతర్జాతీయ శాసన సభల మధ్య పరస్పర సహకారం అవసరం అని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీని జపాన్ హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో జపాన్ దేశానికి చెందిన హిరోషిమా ప్రిఫెక్చ రల్ అసెంబ్లీ, ప్రిఫెక్చరల్ ప్రభుత్వ ప్రతినిధుల బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండ ప్రకాష్, శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్. తిరుపతి , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు.. జపాన్ ప్రతినిధుల బృందానికి తెలంగాణ శాసనసభ తరఫున ఘన స్వాగతం పలికారు. శాసన మండలి చైర్మన్ గుత్తా గారి ప్రసంగం భారతదేశం, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక

తరువాయి 2వ పేజీలో...

హైదరాబాద్-విజయవాడ NH-65 విస్తరణ పనులను

వేగవంతం చేయాలి

NHAI ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కోరిన మంత్రి కోమటిరెడ్డి

2026 నవంబర్ 11 వరకు టెండర్ల దాఖలుకు గడువు.. 2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తామని NHAI ఛైర్మన్ హామీ

ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రద్దీ తగ్గింపునకు ఆరు లేన్ల విస్తరణ కీలకం



న్యూఢిల్లీ: హైదరాబాద్–విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి–65 విస్తరణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో NHAI ఛైర్మన్‌తో పాటు సభ్యులు (ప్రాజెక్టులు) విప్నేష్ శర్మతో మంత్రి సమావేశమై ఈ కీలక ప్రాజెక్టుపై చర్చించారు.

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అత్యంత కీలకమైన ఈ జాతీయ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి విస్తరణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని NHAI అధికారులను కోరారు.

నాలుగు లేన్ల నుంచి
ఆరు లేన్లు+2సర్వీస్ రోడ్లు విస్తరణ

ప్రతిపాదిత ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లుగా విస్తరించడంతో పాటు, ఇరువైపులా సర్వీస్ రోడ్లు, నియంత్రిత ప్రవేశ సౌకర్యాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ విస్తరణ పూర్తయితే వాహనాల రాకపోకలు సులభతరమవడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంతో.. ఖమ్మం ప్రాంతానికి

ఆధ్యాత్మిక శోభ

శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి - కులమతాలకు అతీతంగా ధర్మమార్గంలో పయనించాలి

ప్రజలందరికీ శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహం కలగాలి

ఆలయ నిర్మాణానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలి

ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమి పూజ, శంకుస్థాపన

ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ప్రధాన కారణం : టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు

ఆలయ నిర్మాణానికి పలువురు దాతల విరాళాల ప్రకటన



ఖమ్మం, అక్టోబర్ 12(ప్రజా కలం న్యూస్) ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం శుభసూచకమని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య హోమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో శ్రీవారి భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., కొత్తగూడెం, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివ రావు, మట్టా రాగమయి దయానంద్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో శుభప్రదమని అన్నారు. దేశంలో ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా రైతులు, కుమ్మరులు సహా అన్ని వర్గాల ప్రజలు ముందుగా భగవంతుడిని స్మరించుకుని తమ పనులను ప్రారంభిస్తారని తెలిపారు. భగవంతుడిని స్మరించుకోవడం మన సంస్కృతిలో అంతర్భాగమని అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రస్తుత టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు టెలివిజన్ మాధ్యమం ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు.

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఖమ్మం నగరానికి విచ్చేసేందుకు నేడు తొలి అడుగు పడిందని అన్నారు. ఆశ్వయుజ మాసం సోమవారం నాడు ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పమని పేర్కొన్నారు. స్వామివారు ఖమ్మం నగరాన్ని పవిత్రం చేసేందుకు స్వయంగా ఇక్కడకు వస్తున్నారని, ప్రజలందరికీ ఆశీస్సులు అందించనున్నారని తెలిపారు.

శ్రీవారి అలంకార విశేషాల్లో అంతర్లీనమైన ఆధ్యాత్మిక సందేశం:

శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ, శ్రీ వేంకటేశ్వర స్వామివారి అలంకార సంప్రదాయానికి సంబంధించిన విశేషాలను వివరించారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం రామానుజాచార్యుల వారి కాలంలో ఏర్పాటైన సంప్రదాయం ప్రకారం, వారంలోని వివిధ రోజుల్లో స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించే విధానం కొనసాగుతోందని తెలిపారు. ఈ సంప్రదాయాల వెనుక భగవంతుని ఆరాధన, ఆధ్యాత్మిక భావన, భక్తుల విశ్వాసం ఉన్నాయని తెలిపారు. ఆశ్వయుజ మానం సోమవారం నాడే శ్రీనివాసుడు భూమిపై అడుగుపెట్టారని, అదే ఆశ్వయుజ మానం సోమవారం నాడు ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పమని , స్వామివారి అనుగ్రహానికి నిదర్శనమని పేర్కొన్నారు.

వసుధైక కుటుంబ భావన
మన ధర్మానికి మూలం:

మన దేశం, మన ధర్మం ప్రపంచానికి ఆదర్శమని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

యాసంగిపై 'ఎల్‌నినో' పిడుగు

వరి జోలికి వెళ్లొద్దు.. తాగునీటికే తొలి ప్రాధాన్యం

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నీరు..విద్యుత్ సమస్యలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి,మంత్రులు,సీఎస్ వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్/సుల్తానాబాద్, అక్టోబర్ 12(ప్రజాకలం జిల్లా ప్రతినిధి): సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని, నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు యాసంగి 2026-27 పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు.సోమవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజులతో కలిసి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సుల్తానాబాద్ మండలం కనుకుల రైతు వేదిక నుంచి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,అధికారులు,రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో సాగుకు దూరంగా ఉండటమో లేదా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడమో చేయాలన్నారు. వచ్చే ఏడాది జూన్ వరకు ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.మనుషులతో పాటు పశువుల దాహార్తి, మేత కొరత రాకుండా పశు సంవర్ధక,గ్రామీణాభివృద్ధి శాఖలు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పరికి బదులు ఆరుతడి
పంటలు మేలు: మంత్రి తుమ్మల

అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పప్పుధాన్యాలు,నూనెగింజలు,ఉద్యాన పంటల సాగుతో పాటు సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో నీటి లభ్యత,విద్యుత్ సరఫరా వివరాలను రైతులకు పారదర్శకంగా తెలపాలన్నారు.

జలాశయాల్లో నీరు అడుగంటింది: సీఎస్ సంజయ్ జాజు

రాష్ట్రంలో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని,కృష్ణా, గోదావరి బేసిన్లతో పాటు సింగూరులోనూ నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు.ఈ నీటిని సాగుకు ఇవ్వలేమని,తాగునీటికే కేటాయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధి లేక గ్రామీణ ప్రజలు ఇబ్బంది పడకుండా ఉపాధి హామీ పనులను ముమ్మరం చేసి,రోజువారీ కూలీల సంఖ్యను 5 లక్షలకు పెంచాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో చెప్పుకోదగ్గ వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ నిపుణురాలు డాక్టర్ ఎ.శ్రావణి వివరించగా,విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఇంధన శాఖ కార్యదర్శి సవీన్ మిట్టల్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్,ఉద్యాన అధికారి ప్రసాద్,డిసిఓ శ్రీమాల,ఎన్ఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కలం కౌంటర్



ఎల్ నినో ప్రభావ ఉపశమానికి

ఆరుతడి పంటలు మేలు చేస్తాయి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్/నిర్మల్, అక్టోబర్ 12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఆరుతడి పంటల సాగుతో ఎల్ నినో ప్రభావానికి ఉపశమనం లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.సోమవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ఇతర ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులతో కలిసి అన్నిరైతు వేదికల ద్వారా కలెక్టర్లు, అధికారులు, రైతులతో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా తీవ్రంగా ఉందని,

తరువాయి 2వ పేజీలో...

భారత్-జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలు

మరింత బలోపేతం కావాలి

మొదటి పేజీ తరువాయి...

సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. జపాన్ దేశం సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధి, క్రమశిక్షణ, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం కూడా సమాచార సాంకేతికత, ఫార్మా, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, జపాన్‌లోని హిరోషిమా ప్రాంతం మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హిరోషిమా నగరం ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, రెండో ప్రపంచ యుద్ధంలో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కొన్నప్పటికీ శాంతి, పునర్నిర్మాణం, అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. హిరోషిమా ప్రజలు చూపిన ఆత్మవిశ్వాసం, పట్టుదల, శాంతి సందేశం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రపంచంలో శాంతి, సామరస్యం, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభల పాత్ర ఎంతో కీలకమని, వివిధ దేశాల శాసనసభల మధ్య జరిగే ఇటువంటి సమావేశాలు శాసన ప్రక్రియలు, పరిపాలనా విధానాలు, ప్రజాస్వామ్య విలువలపై పరస్పర అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికి జపాన్‌లోని మియోషి నగరంతో ఉన్న సోదర నగర సంబంధాలు ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక, సామాజిక అనుబంధానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జపాన్ పెట్టుబడులు మరింత పెరగాలని, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేసేందుకు పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. తెలంగాణ అసెంబ్లీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ పర్యటన భారత్-జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రసంగం

భారతదేశం, జపాన్ దేశాల మధ్య చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయని, రెండు దేశాలు ప్రజాస్వామ్య విలువలు, శాంతి, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని శాసనసభ సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభను జపాన్ హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధులు సందర్శించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. తెలంగాణ, హిరోషిమా ప్రాంతాల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలు, విద్య, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయిలో ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, పరిశోధన, పారిశ్రామిక రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. జపాన్ దేశానికి చెందిన పారిశ్రామిక సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని, దీని ద్వారా రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు. ముఖ్యంగా ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాల్లో జపాన్ సాంకేతిక పరిజ్ఞానం, తెలంగాణలోని మానవ వనరులను సమన్వయం చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య దేశాల్లో శాసనసభలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబాలుగా నిలుస్తాయని, ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, జవాబుదారీతనం పెంపొందించడంలో శాసనసభల పాత్ర అత్యంత ముఖ్యమైనదని వివరించారు. తెలంగాణ శాసనసభ, హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ మధ్య శాసన విధానాలు, సభా నిర్వహణ, శాసనసభ కమిటీల పనితీరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై పరస్పర అనుభవాలను పంచుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. రెండు ప్రాంతాల శాసనసభల మధ్య ప్రతినిధుల పర్యటనలు, అధ్యయన కార్యక్రమాలు, పరస్పర చర్చలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. జపాన్ దేశం నుంచి క్రమశిక్షణ, సమయపాలన, సాంకేతిక నైపుణ్యం, విపత్తుల నిర్వహణ వంటి అంశాల్లో నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. హిరోషిమా నగరం విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు సాగిన ప్రయాణం ప్రపంచానికి గొప్ప సందేశాన్ని అందిస్తోందని, శాంతి, సహనం, మానవత్వం ద్వారా సమాజాలు అభివృద్ధి సాధించగలవని నిరూపించిందని తెలిపారు. తెలంగాణ, జపాన్ మధ్య విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు పెరగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్-మియోషి నగరాల మధ్య కొనసాగుతున్న సోదర నగర భాగస్వామ్యం ఇరు ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతోందని పేర్కొన్నారు. ఈ సమావేశం కేవలం అధికారిక పర్యటనగా మాత్రమే కాకుండా తెలంగాణ-జపాన్ ప్రాంతాల మధ్య భవిష్యత్తు సహకారానికి బలమైన వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజల తరఫున జపాన్ ప్రతినిధులకు హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తూ, ఇరు ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావాలని శాసనసభ సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండ ప్రకాష్ గారు, శాసన మండలి సెక్రెటరీ డా.నరసింహాచార్యులు గారు, శాసనసభ సెక్రెటరీ శ్రీ రెండ్ల తిరుపతి గారు, జపాన్ ప్రతినిధుల బృందం సభ్యులు, శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావ ఉపశమానికి ఆరుతడి పంటలు మేలు చేస్తాయి

మొదటి పేజీ తరువాయి...

రైతులంతా తక్కువ నీటితో, స్వల్ప కాలంలో పండే పంటలను మాత్రమే సాగు చేయాలని అన్నారు. వర్ష భావ పరిస్థితుల వల్ల రైతులు సాగు చేసిన పంటలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని, దిగుబడులు పూర్తిగా తగ్గాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రైతులు నూనె గింజలు, పప్పు దినుసులు సాగు చేయాలని సూచించారు. నూనె గింజల్లో వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమలు, నువ్వుల పంటలతో పాటు, పప్పు దినుసుల్లో పెసర్లు, మినుములు, శనగలు, కందుల రకాలు సాగు చేయాలని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు కూడా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

సాంప్రదాయ పంటలకు భిన్నంగా ఇటువంటి పంటలను పండిస్తే భూసారం కూడా పెరుగుతుందని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు అందరూ కలిసికట్టుగా ఎల్ నినో ముప్పును ఎదుర్కోవాలని చెప్పారు.

జాబ్ కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ వివిజి రామ్ జీ పథకం కింద పని పొందాలని పిలుపునిచ్చారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. విద్యుత్ వినియోగం కూడా గత ఏడాదితో పోలిస్తే పెద్ద ఎత్తున పెరిగిందన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అన్నారు. తదనుగుణంగా రైతులు, అధికారుల సూచనల మేరకు తమ పంట సాగు ప్రణాళికలు చేసుకోవాలన్నారు.

అధికారులంతా రైతులను కలుస్తూ వాతావరణ పరిస్థితులు, పంట సాగు వివరాలు వెల్లడించి, ఆరుతడి పంటల సాగువైపు వారిని ప్రోత్సహించాలన్నారు. వాస్తవ పరిస్థితులని వారికి వివరించాలని తెలిపారు.

నిర్మల్ గ్రామీణ మండలం న్యూ పోచంపాడ్ రైతు వేదిక నుంచి ఈ రైతునేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వల్ప కాలంలో, తక్కువ తడులతో పండే పంటలు పండించేందుకు ముందుకు రావాలన్నారు. పప్పు దినుసులు, నూనె గింజల పంటలు పండించడం వల్ల రైతులు వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోకుండా ఉంటారని పేర్కొన్నారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ వివిజి రామ్ జీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు అధికారుల సేవలు వినియోగించుకోవాలని వివరించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు పండించాలని తెలిపారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో రైతులు అధికారుల సూచనలు పాటిస్తే మేలు కలుగుతుందని వివరించారు.

ఈ రైతు నేస్తం కార్యక్రమంలో ఉద్యానవన పంటల అధికారి రమణ, డిఆర్డిఓ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపిడిఓ సుధాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు భీమ్ రెడ్డి, షిండే ఆనంద్ రావు పటేల్, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంతో.. ఖమ్మం ప్రాంతానికి

ఆధ్యాత్మిక శోభ

మొదటి పేజీ తరువాయి... ప్రపంచంలోని ప్రతి ఒక్కరిపై ఎలాంటి భేదభావాలు లేకుండా భగవంతుని అనుగ్రహం ఉండాలని కోరుకోవడం భారతీయ సంస్కృతిలోని గొప్ప లక్షణమని పేర్కొన్నారు. అందరూ బాగుండాలని కోరుకునే వసుధైక కుటుంబ భావన మన ఆశయమని తెలిపారు.శ్రీరాముడు బోయవాడిని, శబరిని, పక్షి రూపంలో ఉన్న జటాయువును, విభీషణుడిని కరుణించిన విషయాలను ప్రస్తావిస్తూ, భగవంతుని దృష్టిలో భక్తి, మంచి మనసు, ధర్మబద్ధమైన జీవనానికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.పదిమందికి మేలు జరగాలని కోరుకునే వారందరూ మనవారేనని, ఇతరులకు హాని కలగాలని కోరుకునే వారు శత్రువులుగా మారుతారని అన్నారు. కృష్ణుడిని ఆరాధించేవారు మనకు మిత్రులు, ద్వేషించేవారు శత్రువులు అనే భావనను బోధాదేవి చెప్పినట్లు ప్రస్తావిస్తూ, మన మంతా ఇదే ధర్మసూత్రాన్ని అనుసరించాలని సూచించారు.

వేదాలు బోధించిన సన్మార్గాన్ని ప్రోత్సహించే ప్రతి ఒక్కరూ కులాలకు అతీతంగా మనకు మిత్రులేనని తెలిపారు. కులాల ఆధారంగా విడిపోకుండా, మనమందరం ఒకే భగవంతుని సంతానమని, ఒకే భూమాతకు చెందినవారమని గుర్తించాలని అన్నారు. మనందరికీ ఉమ్మడి గుర్తింపుగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఉండాలని ఆకాంక్షించారు.

ధర్మ పరిరక్షణకు ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు:

ప్రజలందరూ ధర్మమార్గాన్ని అనుసరించేలా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రేరణ నిస్తుందని శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి తెలిపారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ధర్మం, మానవత్వం, పరస్పర సహకారం, సమాజ శ్రేయస్సు వంటి విలువలను ప్రజల్లో పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని అన్నారు.శ్రీరాముడు, శ్రీ వేంకటేశ్వర స్వామి మధ్య విడదీయలేని ఆధ్యాత్మిక అనుబంధం ఉందని పేర్కొన్నారు. భగవంతుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, సమాజంలో సద్భావన, ఐక్యత పెంపొందాలని ఆకాంక్షించారు.

ప్రతి భక్తుడు ఆలయ నిర్మాణంలో భాగస్వామి కావాలి:

ఖమ్మంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా విరాళాలు అందించాలని, ప్రతి భక్తుడు ఒక ఇటుక అందించినా ఆలయ నిర్మాణంలో భాగస్వామి అయినట్లేనని అన్నారు.

టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నేతృత్వంలో త్వరలోనే సుందరమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆలయం ఖమ్మం ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచి, భక్తులకు స్వామివారి సేవలో పాల్గొనే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి ఖమ్మం నగరానికి విచ్చేసి ప్రజలందరినీ ఆశీర్వదిస్తున్నారని, ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి కోరారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామికి, ఆలయ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు, టీటీడీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీరాముడి ఆశీస్సులతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరగడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తయి ఈ ప్రాంతం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖమ్మం ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి కీలకం:

టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ ఖమ్మంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ప్రధాన కారణమని అన్నారు. చిన్నతనంలో విక్రమార్కుడి గురించి చదువు కున్నామని, ప్రస్తుతం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూపంలో అలాంటి వ్యక్తిత్వాన్ని చూస్తున్నామని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, రాబోయే ఏడాది కాలంలో ఐదు వేల ఆలయాలను నిర్మించాలనే ప్రణాళిక ఉందని తెలిపారు. అలిపిరి వద్ద రూ. 2,700 కోట్లతో సమగ్ర టౌన్‌షిప్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని, రద్దీ సమయాల్లో సుమారు 20 వేల మందికి వసతి కల్పించేలా ఈ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

వశ్శిమ బెంగాల్, అస్సాం, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ తర్వాత ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి అనుమతి లభించిందని, కరీంనగర్‌లోనూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవు తాయని చెప్పారు.

టీటీడీ నిబంధనల ప్రకారం స్థానిక ఆలయ నిర్మాణానికి 25 శాతం నిధులను స్థానిక భక్తులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. ఖమ్మంలో సుమారు రూ.100 కోట్ల విలువైన భూమిని టీటీడీకి కేటాయించినందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఆలయ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తాం:

టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్ మాట్లాడుతూ ‘‘వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన। వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి।।’’ అనే శ్లోకం శ్రీ వేంకటేశ్వర స్వామి మహిమను తెలియజేస్తుందని అన్నారు.

టీటీడీ సమూనాలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఖమ్మంలో నిర్మితం కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా భూమి పూజ జరగడం మరింత విశేషమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర రాజధానులతో పాటు ముఖ్యమైన పట్టణాల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టీటీడీ చర్యలు తీసుకుంటోందని అన్నారు. భక్తుల సహకారంతో ఖమ్మం ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.అనంతరం ఆలయ నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతల వివరాలను మంత్రి వెల్లడించారు. ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో భోజన ఏర్పాట్లు చేసిన వ్యక్తి కూడా ఆలయ నిర్మాణానికి అదనంగా రూ.11 లక్షలు విరాళంగా అందించారు. విరాళాలు ప్రకటించిన దాతలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామిపై భక్తి, విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి తమ వంతు విరాళాలు అందించి ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, ప్రజా ప్రతినిధులు రాయల నాగేశ్వర రావు, విద్యుత్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, దేవాదాయ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రాంగణంలో అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు

మొదటి పేజీ తరువాయి...

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు. బంతి, చామంతి, గునుగు, తంగేడు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళా ఉద్యోగులు, సిబ్బంది చుట్టూ చేరి “బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో” అంటూ పాటలు పాడుతూ ఆడిపాడారు. మహిళలంతా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణం సోమవారం సాయంత్రం రంగురంగుల పూలతో, ఆడపడుచుల ఆనంద కోలాహలంతో కళకళలాడింది. బతుకమ్మ వేడుకల్లో శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు గారు, శాసనసభ సెక్రెటరీ శ్రీ ఆర్. తిరుపతి గారు, శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్-విజయవాడ NH-65 విస్తరణ పనులను వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యంగా ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని వివరించారు.

2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తాం: NHAI ఛైర్మన్

మంత్రి విజ్ఞప్తిపై స్పందించిన NHAI ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్, ఈ ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల దాఖలుకు 2026 నవంబర్ 11 చివరి తేదీగా నిర్ణయిం చినట్లు తెలిపారు. 2027 జనవరి నాటికి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజల ప్రాణాల భద్రతే ప్రాధాన్యం

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వేలాది మంది ప్రయాణికులు, వాహనదారులకు నిత్యం కీలక రవాణా మార్గంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రమాదాలను తగ్గించి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా విస్తరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని స్పష్టం చేశారు.

రహదారుల అభివృద్ధి అంటే కేవలం ప్రయాణ సౌకర్యాలను పెంచడమే కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడటం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వడం, తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడం కూడా అని మంత్రి పేర్కొన్నారు.

యూపీ బోర్డ్ పరీక్షల్లో టాపర్ నుంచి హార్వర్డ్ వరకు..

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ప్రస్థానం!



న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు. ఆయనను సీఈసీ పదవికి రాజీనామా చేయాలంటూ ఇండియా కూటమి నేతలు ఢిల్లీలో నిరసనలు చేస్తున్నారు. అలానే సీజేపీ నేతలు కూడా సీ ఈసీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని సాధారణ పాఠశాల విద్యార్థి దశ నుంచి కేంద్రం ఎన్నికల సంఘ ప్రధాన కమిషనర్ వరకు సాగిన ఆయన ప్రయాణం గురించి తెలుసుకోవాలని చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. మరి.. ఆయన జర్నీ ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం...

1964లో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జన్మించిన జ్ఞానేశ్ కుమార్ గోరఖ్‌పూర్, లఖ్‌నవూ, కాన్పూర్‌లలో తన పాఠశాల విద్యను పూర్తిచేశారు. 1979 పదో తరగతి, 1981 ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఆ రెండు బోర్డులోనూ టాపర్‌గా నిలిచారు. అనంతరం కాన్పూర్‌లోని ప్రఖ్యాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టా అందుకున్నారు. అంతేకాకుండా, ఐసీఎఫ్ఏఐలో బిజినెస్ ఫైనాన్స్, హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్ అభ్యసించారు. ఆయన ప్రతిభను గుర్తించిన ఐఐటీ కాన్పూర్ 2025లో ప్రత్యేకంగా డిస్టింగ్యూష్డ్ అల్యూమ్నస్ అవార్డుతో సత్కరించింది. 1988 బ్యాచ్‌కు చెందిన కేరళ కేడర్ ఐఏఎస్ అధికారిగా సివిల్ సర్వీసెస్‌లోకి అడుగుపెట్టిన జ్ఞానేశ్ కుమార్, రాష్ట్రంలోనూ.. కేంద్ర హోంమంత్రిత్వ శాఖలోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. జమ్మూకశ్మీర్, అయోధ్య వంటి సున్నితమైన వరిణామాల సమయంలోనూ ఆయన సేవలందించారు. ప్రభుత్వ సర్వీసు నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత ఎన్నికల కమిషనర్‌గా నియమితులైన ఆయన, ఆ తర్వాత దేశ 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నత స్థానాలకు చేరిన ఆయన ప్రస్థానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ధరలపై ప్రభుత్వం పునఃసమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 12: ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ఛార్జీలపై పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కామన్ పాస్ ధరలుఅధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

ఛార్జీలపై సమీక్ష జరిపేందుకు సర్కార్ నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిం చనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్ ధర రూ.400 కాగా.. నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500గా నిర్ణయిం చామని మంత్రి తెలిపారు. అయితే సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఛార్జీలపై పునఃసమీక్ష చేయనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని స్పష్టం చేశారు. ఆర్టీసీ-మెట్రో సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే కామన్ పాస్ ధరలపై తుది నిర్ణయం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

సమర్థవంతమైన సేవలు అందించాలి

జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ - రోడ్డు ప్రమాదాల నివరణపై దృష్టి సారించాలి
దేవీ నవరాత్రి వేడుకలకు భారీ బందోబస్తు - అధికారులకు, సిబ్బందికి ఎస్పి ప్రసంశ

జగిత్యాల్ ప్రతినిధి
అక్టోబర్ 12 (ప్రజాకలం)



నేర విచారణ మరింత సమర్థవం తంగా చేయడంతో పాటు కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా సమర్థవంతంగా పని చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ కేసులపై పోలీస్ అధికారులు తీసుకొన్న ప్రత్యేక చొరవతో పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించారని అన్నారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అవసమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. ఎస్సి, ఎస్టి కేసు లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోక్సో యాక్ట్ కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన ఫంక్షనల్ వర్టికల్స్ పటిష్ట అమలు పరుస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించా లని సూచించారు. దొంగతనాల నివార ణకు రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను, నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి అని తెలిపారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీం ను నియమించి వాటి నివారణకు కృషి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలువరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరుగు ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సూచి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాల, రాష్ట్ర సరిహద్దుల నుండి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణా పకర్బందీగా నియంత్రిం చాలన్నారు. అక్రమ కార్యకలాపాలు అయిన గుట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట,గుడుంబా, రేషన్ రైస్, వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు. వచ్చే నెల 4 వ తేదీన ప్రారంభంకానున్న దుర్గా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వేడుకలను ప్రజలు శాంతియుతంగా, ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు.

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంస ప్రోత్సాహకాలు

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన, గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడంలో ప్రముఖ పాత్ర వహించిన , రాజి పడదగిన కేసులలో లోక్ అదాలత్ లో పరిష్కరించేందుకు కృషి చేసిన పోలీస్ అధికారులను మరి సిబ్బందిని జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.సమావేశంలో అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డిఎస్పి లు రాములు , పురుషోత్తం రెడ్డి, రవికుమార్, డిసిఆర్బీ, సిసిఎస్,ఐటి కోర్ ఇన్స్పెక్టర్ లు, ఎస్.ఐ లు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌లీలా కార్యక్రమానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి రూ.1,00,116 చెక్కు అందజేత



బెల్లంపల్లి, అక్టోబర్ 12(ప్రజాకలం) ప్రతినిధి.. దసరా పండుగ సందర్భంగా బెల్లంపల్లి తిలక్ స్టేడియం గ్రౌండ్‌లో లో నిర్వహించనున్న రామ్‌లీలా కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో రూ.1,00,116 చెక్కును హిందూ ఉత్సవ సమితికి అందజేశారు.ఎమ్మెల్యే ఢిల్లీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో, సోమవారం బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు,మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సతీష్,మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమరి సూరిబాబు,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ చేతుల మీదుగా హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు కోడి రమేష్, నగేష్, బాల సంతోష్, నరేష్‌లకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రాజజ మెంబర్ చిలుముల శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిమంద రమేష్, కంకటి శ్రీనివాస్, బండి రాము, కొత్తపల్లి శ్యామ్, ణజజ ప్రధాన కార్యదర్శి గెల్లీ జయరాం, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అష్టల్, పట్టణ ఉపాధ్యక్షుడు లెంకల శ్రీనివాస్, మత్తమరి శ్రీనివాస్, ఎండీ వజీయార్,ఎండి వాజిద్, నాగేందర్, అచ్చే సాయికిరణ్, రామిల్ల ప్రదీప్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో రామ్ లీలా కార్యక్రమం పనుల ప్రారంభం..



బెల్లంపల్లి స్టేడియంలో ఈ నెల 20న హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రామ్ లీలా కార్యక్రమ ఏర్పాట్లను మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్, వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా రోజున జరిగే వేడుకలకు భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు నగేష్, కోడి రమేష్, రాచర్ల సంతోష్, శ్రీనివాస్, కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, కాంగ్రెస్ సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షుడు బండి రాము రామకృష్ణ. నాయకులు కొత్తపల్లి శ్యామ్, పీక లక్ష్మణ్, గెల్లి జయరాం కౌన్సిలర్ మతమారి రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు..

గంగదేవిపల్లి నర్సరీలో ఎండిపోయిన మొక్కలు

- అటు వైపు కన్నెత్తి చూడని అధికారులు..
- వృథా అవుతున్న ప్రజాధనం



గొల్లపల్లి అక్టోబర్ 12 ప్రజాకలం ప్రతినిధి: వనమహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వం పచ్చదనాన్ని పెంపొందించేందుకు నర్సరీల ద్వారా మొక్కలను పెంచుతున్నప్పటికీ, గొల్లపల్లి మండలం గంగదేవిపల్లి గ్రామంలోని నర్సరీలో మొక్కలు ఎండిపోవడం ఆందోళన వ్యక్తమవుతోంది. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు సరైన సమయంలో నీరు,ఎరువులు అందించి, అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉండగా, మొక్కలు ఎండిపోయిన పరిస్థితి నెలకొనడంపై స్థానికంగా విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రజాధనంతో మొక్కలను పెంచుతున్నప్పుడు వాటిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వనమహోత్సవంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో నర్సరీలో మొక్కలు ఎండిపోవడం అధికారుల, ప్రజా ప్రతినిధులు,వారి పర్యవేక్షణ ఎలా ఉందో అర్థమవుతుంది.మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా, అవి పెరిగి పెద్దయ్యే వరకు సంరక్షించడం ముఖ్యమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోయిన మొక్కలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వాటి పరిస్థితిని పరిశీలించి సంరక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యానికి కారణమైన ఫీల్డ్ అసిస్టెంట్ ,కార్యదర్శి, సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

తోటి విలేకరికి అండగా ప్రెస్ క్లబ్ సభ్యులు

అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టుకు రూ.20 వేల ఆర్థిక సాయం



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 12 (ప్రజాకలం) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోటి విలేకరికి మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు అండగా నిలిచారు. మానవత్వంతో స్పందించి తమ వంతుగా రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు జంగం విజయ్ అనారోగ్యంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి విజయ్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూరం సంజీవ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అఫ్రోజ్, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశం



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 12 (ప్రజాకలం):

ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రజావాణికి వస్తున్నందున, ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 49 ఫిర్యాదులు, వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో కె. వై. ప్రసాద్, ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహారావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన ద్విచక్ర వాహనాల వేలం



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 12(ప్రజా కలర్): ఆబ్కారీ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను రవాణా శాఖ నిర్ధారించిన మూల్యాంకనం ఆధారంగా బహిరంగ వేలం వేయనున్నట్లు మెట్‌పల్లి ఆబ్కారీ, మద్యపాన నిషేధ శాఖ అధికారులు తెలిపారు. జగిత్యాల జిల్లా మద్యపాన నిషేధ అధికారి ఆదేశాల మేరకు అక్టోబర్ 13న ఉదయం 9 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో షైన్, ప్యాషన్ ప్రో, టీవీఎస్ ఎక్స్‌ఎల్ తదితర ద్విచక్ర వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల ప్రజలు వేలంలో పాల్గొనవచ్చని అధికారులు సూచించారు.

శబరిమల పాదయాత్ర బృందానికి సన్మానం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 12 (ప్రజాకలం):- మెట్‌పల్లి అయ్యప్ప స్వామి ఆలయం నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరుతున్న రాజేందర్ గురుస్వామి బృందంలోని అయ్యప్ప స్వాములను మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ఘనంగా సన్మానించారు. అయ్యప్ప స్వాముల ఆధ్యాత్మిక యాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సగౌడ్, డాక్టర్ అవుట్ల లక్ష్మణ్, కూన సాయితేజతో పాటు పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం



ఎండపల్లి, అక్టోబర్ 12 : (ప్రజా కలం ప్రతినిధి) మండల కేంద్రంలో గ్రామ ఉపసర్పంచ్ దాసరి కల్యాణి-కొమురయ్య ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు కాలిపోయిన ఘటన మండల కేంద్రం లో చోటుచేసుకుంది. మండలం లో దాసరి కళ్యాణి కొమరయ్య నివాసగృహం సోమవారం రోజున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకు వచ్చేంత లోనె ఇల్లు పూర్తి కాలిపోయింది. స్థానికుల వివరాల ప్రకారం గత మూడు రోజుల క్రితం కొమురయ్య తండ్రి వెంకటస్వామి అనారోగ్యం తో బాధపడుతుంటే కరీంనగర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. కూలి నాలి చేసుకునే మధ్యతరగతి కుటుంబం ఆర్థిక లేమితో ఆసుపత్రి ఖర్చులు లేక ఇబ్బంది పడుతున్న సమయం లో విధి వక్రీకరించి నివసించే పెంకుటిల్లు ప్రమాద వశాత్తు పూర్తిగా కాలిపోవడం చే బాధితులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. కట్టుకునే బట్టలు, వంట సామాగ్రి, మంచాలు, బియ్యం పప్పు దినుసులు డాక్యుమెంట్స్, బంగారు ఆభరణాలు అన్ని పూర్తిగా దగ్ధమయ్యాయి. కాలి పోయిన ఇల్లును చూసి పిల్లలు తల్లి రోధిస్తూ సొమ్ము సిల్లి పడి పోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, సర్పంచ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సుమారు 15 లక్షల అస్తి నష్టం వాటి ల్లిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి ఇల్లు మంజూరు చెయించాలని ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకోలు.

కూలీ నాలి చేసుకుంటేనే పూట గడిసే పరిస్థితిలో తండ్రి ఆసుపత్రి పాలయి ఖర్చులు భారమైన పరిస్థితుల్లో బియ్యం, పప్పు దినుసులు, కట్టుకునే బట్టలతో సహా పూర్తిగా కాలిపోయాయి. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి ఇల్లు మంజూరు చేయించి ఆర్థిక సహాయం అందించాలని వేడు కున్నారు.

గ్రామ సర్పంచ్ మారం సునీత
జలంధర్ రెడ్డి 50,000 ఆర్థిక సహాయం

బాధిత కుటుంబానికి కట్టుబట్టలు నిత్యవసర సరుకులకు గ్రామ పంచాయతీ నుండి 25వేల రూపాయలు, సొంతంగా 25 వేల రూపాయలు సహాయం అందిస్తానని స్థానిక సర్పంచ్ మారం సునీత జలంధర్ రెడ్డి తెలిపారు.

ఖాకీ కల నెరవేర్చేందుకు కలెక్టర్ చేయూత

-22న మెగా మాక్ టెస్ట్.. టాప్-100కు ఉచిత వసతి,శిక్షణ

పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎస్ఐ,కానిస్టేబుల్ అభ్యర్థుల కోసం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో ఈ నెల 22న గోదావరిఖనిలో మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ పరీక్షల సన్నద్ధతను అంచనా వేసుకుని,పోటీ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు ఈ మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష ఉపయోగపడుతుందని తెలిపారు.అక్టోబర్ 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రోత్సాహకంగా మొదటి బహుమతిగా రూ. 10వేలు,రెండో బహుమతిగా రూ. 5వేలు,మూడో బహుమతిగా రూ. 2వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.అదేవిధంగా,పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 100 మంది అభ్యర్థులకు ఉచిత ఫిజికల్ ట్రైనింగ్‌తో పాటు భోజనం,వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆసక్తి గల అభ్యర్థులు https://forms.gle/EwsqCLeErjgEPTih6 లింక్ ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7780543055, 8886304040 నంబర్లలో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గోదూర్ గ్రామ శివారులో ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం..

తృటిలో తప్పిన ప్రమాదం..

ఇబ్రహీంపట్నం, అక్టోబర్12,(ప్రజా కలం) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూరు గ్రామ శివారులో ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్కూటర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది.స్థానికుల కథనం ప్రకారం, ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామానికి చెందిన రాము, అనే వ్యక్తి సోమవారంహూహామెట్ పల్లిలో పనులు ముగించుకొని వర్షకొండకు తిరుగు ప్రయాణంలో గోధుర్ గ్రామ శివారుకు చేరుకొగానే స్కూటర్ నుంచి పొగలు రావడం గమనించి వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపగ ఎలక్ట్రిక్ స్కూటర్ లో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ జరుపుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగదారులు వాహనాల పనితీరుపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని బ్యాటరీ లేదా ఇతర భాగాల్లో అసాధారణ వేడి,పొగ,వంటివి కనిపిస్తే వెంటనే వాహనం నుండి దూరంగా వెళ్లాలని స్థానికులు సూచిస్తున్నారు.



ప్రజా కలం
మంగళవారం, అక్టోబర్ 13, 2026

విశ్వసనీయత పునాదులు తవ్వుతారా

ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప? దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!"ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన? శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అసలు విషయమేమిటంటే? ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం? అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన? ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అసలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా? క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఎన్నికల సంఘంలో లోపాలు ఉంటే, పారదర్శకత లోపిస్తే, నియామక ప్రక్రియలో అధికార పక్షం ఆధిపత్యం పెరిగితే? దానిపై ఖచ్చితంగా పోరాడాలి. న్యాయస్థానాల ద్వారా, పార్లమెంట్ చర్చల ద్వారా ఎన్నికల సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలి. కానీ, తమ రాజకీయం కోసం, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం, వరుస ఓటములను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థల విశ్వసనీయతనే తెగనరకడం రాజకీయం అనిపించుకోదు. అది కేవలం చేతకానితనం మాత్రమే అవుతుంది. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకుని, వారి మెప్పు పొంది గెలవడానికి ప్రయత్నించాలి. తమ వైఫల్యాలను ఎన్నికల సంఘంపైకి తోసేసి చేతులు దులుపుకునే సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలకాలి. వ్యవస్థల లోపాలను సరిదిద్దే దిశగా సాగే పోరాటమే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంది తప్ప, వ్యవస్థలను నాశనం చేసే ధోరణి దేశానికే చేటు చేస్తుంది!. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి పార్టీలు అదే చేస్తున్నాయి.

గోదావరి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి

- దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్



పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకాలం జిల్లాప్రతినిధి)

గోదావరి పుష్కరాలు-2027ను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. సోమవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి సంబంధిత జిల్లాల కలెక్టర్లు,ఉన్నతాధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా శైలజ రామయ్యర్ మాట్లాడుతూ పనుల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. భూసేకరణ, పరిపాలనా అనుమతులు,టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను బట్టి కాకుండా భక్తుల రద్దీ,భద్రత, క్షేత్రస్థాయి సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే కొత్త ఘాట్ల నిర్మాణం చేపట్టాలని, ఇప్పటికే ఉన్న ఘాట్ల మరమ్మతులు,రహదారుల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. దేవాదాయ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ తొక్కిసలాటలకు తావులేకుండా రద్దీని అన్ని ఘాట్లకు మళ్లించేలా ప్రణాళికలు ఉండాలన్నారు.ప్రతి ఘాట్ వద్ద తాగునీరు,పారిశుద్ధ్యం, భద్రతతో పాటు దివ్యాంగుల కోసం ర్యాంపులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి జిల్లా పరిధిలోని గోదావరి తీర ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.అప్రోచ్ రోడ్లు,విద్యుత్ దీపాలు, తాగునీరు,పారిశుద్ధ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖలను సమన్వయం చేస్తూ పనులను వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో పత్తి పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.రాములతో కలిసి సీసీఐ,మార్కెటింగ్ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 51,400 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, దాదాపు 5.14 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పెద్దపల్లి,సుల్తానాబాద్,కమాన్‌పూర్ మార్కెట్ కమిటీల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.రైతులు నష్టపోకుండా నాణ్యతా ప్రమాణాలు,తేమ శాతం,కప్పాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానంపై రైతు వేదికల్లో ఏఈఓలు అవగాహన కల్పించాలన్నారు.వాస్తవ దిగుబడి అధికంగా ఉన్న రైతులతో పాటు కౌలు రైతులు,ఎన్‌డీఎస్ రైతులకు నష్టం కలగకుండా ఏఈఓల క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి కొనుగోళ్లకు అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.కేంద్రాల్లో తాగునీరు,తూకం యంత్రాలు,అగ్నిమాపక భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని,రైతులు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి,డీటీవో శ్రీనివాస్,తూనికలు-కొలతల అధికారి రఘువీర్ సింగ్,సీసీఐ ప్రతినిధులు,మిల్లు యజమానులు పాల్గొన్నారు.

పాత విద్యుత్ సబ్‌స్టేషన్ల ఆధునికీకరణ

నాణ్యమైన విద్యుత్ సరఫరాకే ప్రాధాన్యం

జిల్లాలో 6 సబ్‌స్టేషన్ల పనులు పూర్తి .. పురోగతిలో మరో 13

సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.గంగాధర్



పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో 25 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న పాత 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను దశలవారీగా ఆధునికీకరించి, సరికొత్తగా తీర్చిదిద్దేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ చర్యలు చేపట్టిందని సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.గంగాధర్ తెలిపారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు.

జిల్లా పరిధిలో ఇప్పటివరకు 6 సబ్‌స్టేషన్ల ఆధునికీకరణ పనులు పూర్తి కాగా,మరో 13 సబ్‌స్టేషన్లలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎస్ఈ పేర్కొన్నారు.పాత సబ్‌స్టేషన్లలో తుప్పుపట్టిన స్ట్రక్చరల్ ఛానల్స్, పరికరాలను తొలగించి కొత్తవి అమరుస్తున్నామన్నారు.విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా కండక్టర్ల పరిమాణాన్ని పెంచడం,పాత ఎయిర్ బ్రేక్-ఏబీ స్విచ్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, సర్క్యూట్ బ్రేకర్లలో ఆధునిక విడిభాగాలు అమర్చడం వంటి పనులు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే బస్‌బార్లు,ఐసోలేటర్లు సహా కీలక పరికరాల పనితీరును సమగ్రంగా పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.ఈ ఆధునికీకరణ వల్ల సాంకేతిక లోపాలు,విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గుతాయని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యంగా వేసవి కాలం,వ్యవసాయ సీజన్లలో పెరిగే అధిక లోడ్‌ను తట్టుకునేందుకు ఈ చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.భద్రతా ప్రమాణాలను పాటిస్తూ,ప్రాధాన్యత క్రమంలో వినియోగదారులకు నిరంతర,నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనులు పూర్తి చేస్తున్నామని ఆ ప్రకటనలో ఎస్ఈ గంగాధర్ తెలిపారు.

నరకప్రాయంగా బండారికుంట రోడ్డు

భారీ వాహనాల రాకపోకలను అడ్డుకోవాలని ప్రజావాణిలో మొర

భారీ వాహనాలపై ప్రజావాణిలో కాలనీవాసుల మొర



పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పట్టణంలోని19వ వార్డు పరిధిలోని బండారికుంట ప్రధాన రహదారి గుండా మితిమీరిన బరువుతో వెళ్తున్న భారీ వాహనాల రాకపోకలను వెంటనే నిలిపివేసి, రోడ్డును పునర్నిర్మించాలని కోరుతూ స్థానిక కాలనీవాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ బండారికుంట మార్గానికి ఎలాంటి బైపాస్ రోడ్డు హోదా లేకపోయినప్పటికీ,దళితులు,మైనార్టీలు నివసించే ఇండ్ల మీదుగా భారీ టిప్పర్లు, లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రహదారి పూర్తిగా ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు.భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు కింద ఉన్న తాగునీటి సరఫరా పైపులు పగిలి నీరంతా రోడ్లపై కాలువలా ప్రవహిస్తోందని,వాహనాల ప్రకంపనలకు ఇండ్ల గోడలు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని వాపోయారు.అలాగే విపరీతమైన దుమ్ముధూళి కారణంగా ఇప్పటికే ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్ర అనారోగ్యం పాలయ్యారని, సమీపంలోని ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరి నడుమ రోడ్లపైకి వచ్చి వాహనాలను అడ్డుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని,ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రం సమర్పించిన వారిలో బొంకూరి నవీన్,సుద్దాల శ్రీకాంత్, కనకం సాయి,సుద్దాల శ్రీధర్,నల్లాల తేజ,బొంకూరి అజయ్,ముల్కల వేణుతో పాటు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 19వ వార్డు బాధ్యులు మహమ్మద్ షఫీ,గౌస్,నవాబ్,రియాజ్,బొంకూరి భూలక్ష్మి,మొలకల హారిక,కుక్క మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

- గ్రీవెన్స్ డేలో 14 మంది నుంచి ఫిర్యాదుల స్వీకరణ



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 12 (ప్రజాకలం) జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే గ్రీవెన్స్ డే ప్రధాన ఉద్దేశమని ఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారి వినతులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వేగంగా స్పందించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మెట్‌పల్లిలో రెండు హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 12 (ప్రజాకలం):-

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రాత్రివేళల్లో వెలుతురు సమస్యను తగ్గించేందుకు ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను 11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్ ప్రారంభించారు.గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఒకటి, హనుమాన్ ఆలయం వద్ద మరొక హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేశారు.ఈ లైట్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు అందుబాటులోకి రానుంది. ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు స్థానికులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రైసుద్దీన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, వీడీసీ సభ్యులు బూరం రాజేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.మౌలిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజావాణి కార్యక్రమం లో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం



ఎండపల్లి, అక్టోబర్ 12 : (ప్రజా కలం ప్రతినిధి) మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ సోమవారం రోజున ప్రజావాణి (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు సంబంధించిన 04 దరఖాస్తులు స్వీక రించబడ్డాయి. అధికారులు అర్జీలను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఎంపీడీవో ఆదేశించారు. ఈ కార్యక్రమం లో హాజరైన వివిధ శాఖల అధికారులు (మొత్తం 11 మంది) హాజరయ్యారు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్, రెవెన్యూ శాఖ నుండి ఆర్ ఐ టి అన్వేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి కామల్ల మహేష్, పశు వైద్యాధికారి డాక్టర్ బూర మనోజ్ కుమార్, మండల విద్యాశాఖ నుండి సి ఆర్ పి రాజమణి, వైద్య శాఖ నుండి ఎంపిహెచ్ఏ ఎస్ ఎస్ శ్రీనివాస్, శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి సిడిపిఓ, అంగన్వాడీ) యం. ఆండాలు, సహాయక ఇంజనీర్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుకుమార్, మండల హౌసింగ్ ఏఈ ఎస్. గౌతమి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ / రెంజ్ ఆఫీసర్ ఇస్లావత్ నరేష్, విద్యుత్ శాఖ ఏఈ బండి సమ్మయ్య మండల ప్రజా పరిషత్ -1 తహశీల్దార్ -02 ఇందిరమ్మ ఇల్లు-1 ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని ఎంపీడీవో దొండ కృపాకర్ తెలిపారు.

కిషన్ రావుపేటలో న్యాయం చేయాలంటు" మైనర్ బాలిక " పోరాటం..



వెల్గటూర్, అక్టోబర్ 12,ప్రజాకలం, ప్రతినిధి : ప్రేమ పేరుతో తనను నమ్మించి, శారీరకంగా వాడుకొని పెళ్లి పేరు ఎత్తగానే తప్పించుకొని తిరుగుతున్నాడని తనకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక తన ప్రియుడు ముచ్చర్ల నవీన్ ఇంటి ఎదుట సోమవారం బైటాయించి ధర్నాకు దిగింది. బాలిక తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని కిషన్ రావుపేట గ్రామానికి చెందిన ముచ్చర్ల నవీన్ అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక సంవత్సర కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరు శారీరకంగా కలవడంతో సదరు బాలిక గర్భం దాల్చింది. కాగా కొద్ది రోజులుగా తనను పెళ్లి చేసుకోవాలని మైనర్ బాలిక పలుమార్లు నవీన్ ను కోరిన అతడు పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తూ ఇంటికి తాళం వేసి తనను కలువకుండా తప్పించుకు తిరుగుతున్నట్లు తెలిపింది. తనను నవీన్ పెళ్లి చేసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ అతని ఇంటి ఎదుట బైఠాయించి ధర్నా చేసింది.

ఐరన్ హార్డ్వేర్ పెయింట్స్ షాపును ప్రారంభించిన మాజీ మంత్రి కొప్పుల



ఎండపల్లి, అక్టోబర్ 12 : (ప్రజా కలం ప్రతినిధి)

మండలంలోని రాజారాంపల్లి గ్రామం లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మల్లికార్జున ఐరన్, హార్డ్వేర్, పెయింట్స్ షాపు ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొని నూతన దుకాణాన్ని ప్రారంభించి. ఈ నూతన వ్యాపారం దిన దినాభివృద్ధి చెందాలని, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ షాప్ యజమానుల కు వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

- పెద్దపల్లి ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్



పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని పెద్దపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కొప్పుల శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో,పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపుదల,నీటి సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి పనులు,వ్యక్తిగత మరియు సామూహిక వంటకుంటలు,ఇంకుడు గుంతలు,బోరుబావుల రీఛార్జ్ నిర్మాణ పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మండల పరిధిలోని 45 గ్రామ పంచాయతీలలో కూలీల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని,అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించేలా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు.రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని,పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

కక్షిదారుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్నదానం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల



పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) కోర్టులకు వచ్చే నిరుపేద కక్షిదారులు ఆకలితో అలమటించకూడదనే సదుద్దేశంతోనే ప్రతి సోమవారం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి సునీత కుంచాల పేర్కొన్నారు.ఈ సందర్భంగా సోమవారం మధ్యాహ్న సమయంలో అదనపు న్యాయమూర్తి వంగర భవానితో కలిసి ఆమె కక్షిదారులకు స్వయంగా అన్నదానం చేశారు.అనంతరం ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ మారుమూల గ్రామాలు, సుదూర ప్రాంతాల నుంచి కోర్టు పనుల నిమిత్తం వచ్చే పేద ప్రజలు,కక్షిదారుల కేసుల విచారణ ఒక్కోసారి సాయంత్రం వరకు సాగుతుందని తెలిపారు. చేతిలో డబ్బులు లేక,హోటళ్లకు వెళ్లలేక మధ్యాహ్నం ఆకలితో ఇబ్బంది పడే వారి పరిస్థితిని గమనించే ఈ నిత్యాన్నదానానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.గత జనవరి 5న ప్రారంభమైన ఈ కార్యక్రమం కోర్టు సిబ్బంది,న్యాయవాదులు,దాతల సంపూర్ణ సహకారంతో నేటికీ ప్రతి సోమవారం నిరంతరాయంగా కొనసాగుతోందని,ఎవరూ ఆకలితో వెనుదిరగకూడదనే ఉద్దేశంతో నాణ్యమైన,రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.ఈ బృహత్తర కార్యక్రమానికి పలువురు దాతలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,కక్షిదారులు పాల్గొన్నారు.

పూల సంబురం.. ఆటాపాటల వైభవం

- పెద్దపల్లిలో ఘనంగా తెలంగాణ జాగృతి బతుకమ్మ వేడుకలు

పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ అస్తిత్వానికి,సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన పూల పండుగ బతుకమ్మ సంబరాలు పెద్దపల్లిలో కన్నులపండువగా సాగాయి.తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు మేడారపు రాజ్యలక్ష్మి నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.ఈ సంబరాలకు తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు మరిపెల్లి మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను మధ్యలో ఉంచి,మహిళలంతా వలయాకారంగా తిరుగుతూ లయబద్ధమైన చప్పట్లతో జానపద పాటలు ఆలపించారు.ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ఐదు బతుకమ్మలను ఎంపిక చేసి,వాటిని రూపొందించిన మహిళలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకరి రజిత,నాయకురాళ్లు సలేంద్ర మమతారాణి, శారద,రోజారమణి,ముస్త్యాల స్వప్న,శ్రీలత, అర్నకొండ సరిత,అర్నకొండ పద్మ,కీర్తి ఉమ,రాజం జ్యోతి,దాసరి అంజలి,ఎండీ గౌస్య బేగం సహా పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళల భద్రతపై కాంగ్రెస్ ద్వంద్వ నీతి వీడాలి

ఎంపీ బిమోల్ అకోయిజామ్ రాజీనామా చేయాలి

బీజేపీ మహిళా మోర్చా నిరసన - రాహుల్ గాంధీ,మణిపూర్ ఎంపీ దిష్టిబొమ్మల దహనం



పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జేఎన్యూ మహిళా విద్యార్థులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్నర్ మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ మహిళా మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు వడ్డేపల్లి భారతి డిమాండ్ చేశారు.కాంగ్రెస్ నేతల లైంగిక వేధింపులపై సోమవారం అయ్యప్ప ఆలయ చౌరస్తా వద్ద బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ,ఎంపీ అకోయిజామ్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి భారతి మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో మహిళా విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు.యూనివర్సిటీ అంతర్గత కమిటీ విచారణ నివేదికల నేపథ్యంలో మహిళల ఆత్మగౌరవానికి, రక్షణకు పెద్దపీట వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ,మహిళల గౌరవ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని,ఈ వ్యవహారంపై కాంగ్రెస్ స్పష్టమైన వైఖరిని ప్రకటిస్తూ సదరు ఎంపీతో తక్షణమే రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాతంగి రేణుక మాట్లాడుతూ మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ నీతిని వీడాలన్నారు.విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అకోయిజామ్కు ప్రజాప్రతినిధిగా కొనసాగే అర్హత లేదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులు సుల్వ పద్మ,బండారి లత, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్తూరి సరిత,జనగామ సుజా శ్రీ,అధికార ప్రతినిధి వసంత లక్ష్మి,నాయకులు దాసరి సుశీల,ఇరుగురాల శారద,దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

నిరుపేదల వైద్యానికి భరోసా.. 13 మందికి రూ.6.లక్షల చెక్కులు పంపిణీ

అర్హులైన పేదలు సీఎంఆర్ఎఫ్ను సద్వినియోగం చేసుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్



ఐనవోలు, అక్టోబర్ 12: (ప్రజాకలం ప్రతినిధి)

నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి, ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ప్రభుత్వం సహాయం అందిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఐనవోలు మండలాధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు సోమవారం ఐనవోలు మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6 లక్షల 70 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుపేద కుటుంబాలకు ఈ నిధులు ఎంతో తోడ్పడనున్నాయని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలు వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ సహాయం ఉపయోగపడుతుందని తెలిపారు.

పేదరికం వైద్యానికి అడ్డుకాకూడదు

ఈ సందర్భంగా మోహన్ గౌడ్ మాట్లాడుతూ, పేదరికం కారణంగా ఎవరికీ వైద్యం అందకుండా పోకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్య సమయంలో పేద కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని, తెలంగాణ కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ సహాయాన్ని పొందేందుకు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఈ నిధి ఎంతో ఉపయోగకరమని, అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ ఫలాలు అందించేందుకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్లగూడెం సర్పంచ్ దుప్పెల్లి రాకేష్, వనమాల కనపర్తి సర్పంచ్ రిపిక ఎల్లస్వామి, తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు, యువజన నాయకులు రిపిక వినయ్, చింత కుమారస్వామి,చింత బాబు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ నిధులతో అన్నారం గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

- ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మామునూరు ఏసిపి వెంకటేష్

- పర్వతగిరి ప్యాక్స్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు



(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 12, ప్రజాకలం ప్రతినిధి:

సోమవారం అన్నారం షరీఫ్ గ్రామంలో స్థానిక గ్రామపంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మామునూర్ ఎసిపి వెంకటేష్, పర్వతగిరి ఫ్యాక్స్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, సిఐ సంతోష్ కుమార్, ఎస్సై భోగం ప్రవీణ్, పర్వతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సావిత్రి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, అన్నారం గ్రామ సర్పంచ్ గాడి పెళ్లి మహేందర్, ఉప సర్పంచ్ గొడుగు ఏకాంతం, సారయ్య, ఏఎంసి డైరెక్టర్ గొడుగు బిక్షపతి, ధూప తండా సర్పంచ్ ధర్మసోత్ తిరుపతి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు భాష బోయిన రామకృష్ణ, రాపోలు అనిత రవీందర్, కొండేటి కొమరమ్మ రామచందర్, ముంజంపల్లి నాగరాజు, దొంతమాల పవన్ కళ్యాణ్, రాజబాబు, రాధిక జలంధర్, గ్రామ నాయకులు మునుకుంట్ల బాబు, రామ్మూర్తి, కేదారి జడల కృష్ణ, పుడేటి దయాకర్, ఈరగాని అఖిల్, మధుకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది రామచందర్, మహేందర్, యాకయ్య, వెంకట సాయిలు, కొమరమ్మ, లక్ష్మి, సుగుణమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు అన్నారం షరీఫ్ ప్రముఖ యాత్ర స్థలం కాబట్టి గ్రామంలో నిత్యం పర్యవేక్షణ అర్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చాలా ముఖ్యమన్నారు, ప్రమాదాల నివారణ గ్రామంలోని భద్రతకు ప్రాముఖ్యత ఉంటుందని సూచించారు, ఇదే స్ఫూర్తితో అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏసీపీ వెంకటేష్ సూచించారు.

అరభిందో పాఠశాల విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర

ఉపాధ్యాయులే విద్యార్థులతో స్నేహపూర్వక కలయిక

ఆనందోత్సాహాలతో కొనసాగిన యాత్ర విజయవంతం - వయసుని మరిచి విద్యార్థులతో కేరింతలు, నాట్యం



అక్టోబర్ 12 ప్రజాకలం ప్రతినిది: (వర్ధన్నపేట)

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని శ్రీ అరభిందో హై స్కూల్ లో 2026-2027విద్యాసంవత్సరం 10 వ తరగతి విద్యార్థులని పాఠశాల యాజమాన్యం హైదరాబాద్ కి విజ్ఞాన విహార యాత్ర కి తీసుకెళ్లారు.

ఈ విహార యాత్ర లో ఉపాధ్యాయులు విద్యార్థులకి ఎటువంటి ఆంక్షలు లేకుండా వారితో మమేకమై స్నేహపూర్వకంగా కలిసి పోయారు. అంతే కాకుండా విద్యార్థులతో కలిసి మెలిసి నాట్యం చేసి అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆనందానికి అవధూల్లెకుండా పోయింది. అంత్యక్షరీ, కథలు, వివిధ కల్చరల్ ప్రోగ్రామ్ లతో యాత్ర ఆహ్లాదకర వాతావరణం నడుమ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులని హైదరాబాద్ లోని రామోజీ ఫిలిమ్ సిటీ, వండర్ లా, జూపార్క్, వంటి ప్రదేశాలని వీక్షింప చేసి విద్యార్థుల జీవిత కాలంలో చెందిరిపోని జ్ఞాపకంగా నిలిచిపోయేలా చేసిన ఉపాధ్యాయులకి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సాంబశివరావుకు దాసరి ఉష నివాళులు



పెద్దపల్లి,అక్టోబర్ 12:((ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి నియోజకవర్గంలోని కాల్వ శ్రీరాంపూర్కు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సాంబశివరావు ఆకస్మిక మృతి పట్ల ఆ పార్టీ నాయకురాలు దాసరి ఉష తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించిన ఆమె,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు.అనంతరం జరిగిన అంతిమయాత్రలో సీనియర్ నాయకులు సిఎస్ఆర్,మాజీ సర్పంచ్ ఆడెపు శ్రీదేవి రాజులతో కలిసి ఆమె పాల్గొని సాంబశివరావుకు కడసారి వీడ్కోలు పలికారు.

టీడీపీ బలోపేతానికి ఎస్సీలు నడుం బిగించాలి

- ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నేతల పిలుపు



పెద్దపల్లి,అక్టోబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఎస్సీ శ్రేణులు సమరోత్సాహంతో ముందుకు సాగాలని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు,అరవింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.సోమవారం హైదరాబాద్‌లోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో రాష్ట్ర ఎస్సీ సెల్ ముఖ్య నాయకుల కీలక సమావేశం జరిగింది.రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలంపల్లి అశోక్ అధ్యక్షతన ఈ సమావేశం ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన బక్కని నరసింహులు,అరవింద్ కుమార్ గౌడ్ నాయకులనుద్దేశించి దిశానిర్దేశం చేస్తూ మాట్లాడారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై గళమెత్తి, ఎస్సీల హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలను ఉధృతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అక్కపాక తిరుపతితో పాటు రాష్ట్ర,జిల్లా స్థాయి ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం శిలాఫలకం కూల్చివేత



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 12 (ప్రజా కలం) మండలంలోని కోండికర్ల గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం శిలాఫలకం కూల్చివేత వివాదాస్పదంగా మారింది. శిలాఫలకాన్ని కూల్చివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ఉద్దేశాలతోనే ఈ చర్యకు పాల్పడి ఉంటారని, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే శిలాఫలకాన్ని కూల్చివేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం తగదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్,అక్టోబర్ 13(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూముల కబ్జాలు, అవినీతి, పైరవీల విజన్ మా ఎమ్మెల్యేకు లేదు

- మీ విమర్శలకు మా ఎమ్మెల్యే చేసిన అభివృద్ధే సమాధానం - ప్రజా సంక్షేమం, పారదర్శకత, అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- ఆరూరి రమేష్ విమర్శలకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ ఘాటు కౌంటర్

ఐనవోలు, అక్టోబర్ 12: (ప్రజాకలం ప్రతినిధి)

ప్రజల సంక్షేమం, అభివృద్ధి, పేదలకు అండగా నిలవడమే నిజమైన నాయకత్వానికి కొలమానం తప్ప.. విమర్శలు చేయడం, రాజకీయ ఆరోపణలు గుప్పించడమే విజన్‌కు నిర్వచనం కాదని కాంగ్రెస్ పార్టీ ఐనవోలు మండలాధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు విజన్ లేదంటూ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రజాప్రతినిధుల పనితీరును వ్యక్తిగత విమర్శలతో కాకుండా ప్రజలకు చేసిన సేవలు, అమలు చేసిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ ఫలాల ఆధారంగా అంచనా వేయాలని హితవు పలికారు.

విజన్ అంటే మాటలు కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు

విజన్ లేదని విమర్శలు చేస్తున్న ఆరూరి రమేష్.. అసలు విజన్‌కు మీరిచ్చే నిర్వచనం ఏమిటో ప్రజలకు వివరించాలని మోహన్ గౌడ్ ప్రశ్నించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడం, అర్హులకు ప్రభుత్వ ఫలాలు చేరేలా చూడటం, విద్యా వైద్య రంగాలకు ప్రాధాన్యమివ్వడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం విజన్ కాదా? అని నిలదీశారు. వ్యక్తిగత ప్రయోజనాలే అభివృద్ధికి కొలమానమని భావిస్తున్నారా? ప్రజల అవసరాలు తీర్చడమే నాయకుడి బాధ్యత అని గుర్తించాలన్నారు. ఎమ్మెల్యే నాగరాజు పనితీరుపై విమర్శలు చేసే ముందు, గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని సూచించారు. ఎవరు ఎంత అభివృద్ధి చేశారు? ఏ గ్రామానికి ఎన్ని నిధులు తీసుకొచ్చారు? ఎన్ని సమస్యలకు పరిష్కారం చూపారు? అనే అంశాలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. విమర్శలు చేయడం సులభమేనని, కానీ ప్రజలకు చేసిన పనులను లెక్కలతో వివరించడం ముఖ్యమని వ్యాఖ్యానించారు.

ప్రజల సొమ్ము ప్రజలకే ఉపయోగపడాలి

ప్రజా జీవితంలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని మోహన్ గౌడ్ పేర్కొన్నారు. భూముల కబ్జాలు, అవినీతి, అక్రమ సంపాదన, పైరవీలకు సంబంధించిన ఆరోపణలు రాజకీయ చర్చల్లో వినిపిస్తున్నప్పుడు వాటిపై ఆధారాలతో మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సొమ్ము ప్రజల సంక్షేమానికే వినియోగించబడాలి తప్ప, వ్యక్తిగత ప్రయోజనాలకు కాదని స్పష్టం చేశారు. అయితే ఆరోపణలు చేసే వారైనా, ఆరోపణలు ఎదుర్కొనే వారైనా వాస్తవాలు, ఆధారాలతోనే ప్రజలకు సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాగరాజు పనితీరును సమీక్షించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, అదే విధంగా గత పాలనలో జరిగిన పనులపై కూడా చర్చ జరగాలని అన్నారు. అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చిస్తే ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని తెలిపారు.



దైవభక్తికి హంగులు ఆర్భాటాలు కొలమానం కావు!

ఎమ్మెల్యే నాగరాజుకు దైవభక్తి లేదంటూ చేస్తున్న విమర్శలపైనా మోహన్ గౌడ్ స్పందించారు. దేవుడి ముందు భక్తులందరూ సమానమేనని, దర్శనానికి పైరవీలకు తావులేకుండా ప్రతి భక్తుడికీ సమాన అవకాశం కల్పించాలనే భావనకు ప్రాధాన్యమి వ్వాలని అన్నారు. ఆలయాల వద్ద ఆర్భాటాలు చేయడమే భక్తికి నిదర్శనం కాదని, భక్తుల పట్ల గౌరవం, సేవాభావం, సమానత్వం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ఐనవోలు మండల కేంద్రంలోని పడిపోయిన శివాల మ్రి పునఃప్రతిష్టపన చేస్తే పచ్చగా చిగురిస్తున్న శివాల మ్రిచెట్టు చెబుతుంది మా దైవ భక్తి ఏమిటి అని, ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై చర్చించేటప్పుడు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఆలయాల నిర్వహణపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో ముందుకు రావాలని సూచించారు. మతపరమైన అంశాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం కంటే, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై నిర్మాణాత్మకంగా చర్చించడం అవసరమని అభిప్రాయపడ్డారు.

అంతిమ తీర్పు ప్రజలదే!... రాజకీయ నాయకుల మాటలకు ప్రజలు ప్రభావితం కావడం కంటే, వారి పనితీరును పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని మోహన్ గౌడ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలు, పాలనలో పారదర్శకత వంటి అంశాలే ప్రజాప్రతినిధుల పనితీరుకు ప్రామాణికాలని పేర్కొన్నారు. ఆరూరి రమేష్ చేసిన విమర్శలు వ్యక్తిగత ఆరోపణలకే పరిమితం కాకుండా, ఆధారాలతో కూడిన చర్చకు దారితీయాలని అన్నారు. ఎమ్మెల్యే నాగరాజుకు విజన్ లేదని వ్యాఖ్యానించే వారు తమ పాలనలో సాధించిన అభివృద్ధిని కూడా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ ప్రజలకు ఉపయోగపడే పనులే నాయకత్వానికి నిజమైన కొలమానం. మాటల యుద్ధం కంటే అభివృద్ధిపై చర్చకు రావాలని, ఎవరి పనితీరు ఎలా ఉందో నిర్ణయించే అధికారం ప్రజలకే ఉందని నకరకంటి మోహన్ గౌడ్ స్పష్టం చేశారు.

ఈవీఎంలను రద్దు చేయాలి

- బ్యాలెట్ విధానాన్ని పునరుద్ధరించాలి!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలి

- ఓటర్ల జాబితా సవరణపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలి

- అంబేడ్కరిజం జేఏసీ డిమాండ్

అక్టోబర్ 12, ప్రజాకలం ప్రతినిధి (వర్ధన్నపేట): ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అంబేద్కరిజం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆరోపించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓటర్ల పేర్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని విమర్శించింది. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలను) రద్దు చేసి బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు అంబేడ్కరిజం జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఓటు హక్కు అనేది రాజ్యాంగం పౌరులకు కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉండగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లు, యువ ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6లో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేశారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని సూచించారు.

బ్యాలెట్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఈవీఎంల విశ్వసనీయతపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని జేఏసీ పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు బహుజన వర్గాలకు రాజ్యాధికారంలో సముచిత భాగస్వామ్యం దక్కాలంటే ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత అవసరమని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా పనిచేసే బహుజన సంఘాలు, ఐక్య వేదికలు కలిసి కట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది.ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల సంస్కరణల సాధన కోసం నిరంతర పోరాటం కొనసాగించాలని అంబేద్కరిజం జేఏసీ వర్ధన్నపేట పిలుపునిచ్చింది.

అసంపూర్తిగా ఉన్న రోడ్లను తక్షణమే పూర్తి చేయాలి

నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారులపై బీజేపీ ఫిర్యాదు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, బతుకమ్మ ఆడే ప్రాంతంలో రోడ్డు సరిచేయాలి



ఐనవోలు, అక్టోబర్ 12:- (ప్రజాకలం ప్రతినిధి)

ఐనవోలు మండలంలో గత నాలుగేళ్లుగా అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను తక్షణమే పూర్తి చేసి, ప్రజలకు ప్రమాదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ అధికారులను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు. కొండపర్తి మీదుగా కొత్తపెల్లికి వెళ్లే రహదారితో పాటు వనమాల కనపర్తి–తిమ్మాపూర్ రహదారి పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారులపై ఏర్పడిన ప్రమాదకర పరిస్థితుల కారణంగా ఇటీవల గుగ్గిళ్ల నాగరాజు, నాంపల్లి శ్రీనివాస్ ప్రమాదాలకు గురై గాయపడినట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

నిధుల కొరతతో నిలిచిన పనులు.. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో కొంతమేర రహదారి పనులు జరిగినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేసిన పరిస్థితి ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న అసంపూర్తి రహదారుల సమస్యను పరిష్కరించడంతో పాటు, పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఒంటిమామిడిపల్లి ఎల్లమ్మ చెరువు కట్టపై మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశంలో రహదారిపై ఉన్న కంకరను తక్షణమే తొలగించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పండుగ సమయంలో మహిళలు, గ్రామస్థులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి అధికారుల స్పందన

బీజేపీ నాయకులు అందించిన ఫిర్యాదుపై ఎంపీడీవో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అసంపూర్తి రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఆగారెడ్డి, వార్డు సభ్యులు వేముల ప్రభాకర్ పటేల్, నరిగే రాజేష్, ఆడేపు విక్రమ్, కోట కిరణ్, కన్నయ్యతో పాటు వివిధ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణ ఫౌండేషన్ నలమాస సంధ్య

డా. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ

బింగీ గణేష్ మహాలక్ష్మి ప్రథమ చికిత్స కేంద్రం ప్రారంభోత్సవం



మరిపెడ అక్టోబర్ 12 (ప్రజా కలం)

మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం లోని గుండెపూడి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. డా. నలమాస కృష్ణ ఫౌండేషన్ (ఎన్ కె ఎఫ్) సహకారంతో చేపడుతున్న. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫౌండేషన్ చైర్మన్ నలమాస సంధ్య ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడుతూ, ఆయన ఆశయాలను భావితరాలకు అందించేందుకు ఈ విగ్రహ ప్రతిష్ట దోహదపడుతుందని అన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ లకావత్ రవికుమార్, ఉప సర్పంచ్ గడ్డం ఉప్పిరెడ్డి, బోడపట్ల యకస్వామి, వడ్లకొండ నరేష్, బాబు,గాయం జగదీశ్వర్ రెడ్డి, గడ్డం వెంకట్ రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం తానం చెర్లలో నూతనంగా ప్రారంభించిన బింగి గణేష్ మహాలక్ష్మి ప్రథమ చికిత్స కేంద్రం ను సందర్శించారు. ఆమె వెంట గండి గణేష్, శంకర్, మెంచు రమేష్, మల్లయ్య లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు తహసీల్దార్ పనితీరుపై విమర్శలు తగవు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విధి నిర్వహణ

- పారదర్శక పాలన, నిబద్ధతతోనే ప్రత్యేక గుర్తింపు - పైరవీలకు తావులేకుండా తహసీల్దార్ బాధ్యతల నిర్వహణ

ఐనవోలు, అక్టోబర్ 12 (ప్రజాకలం ప్రతినిధి):

ఐనవోలు మండల తహసీల్దార్ విక్రమ్ కుమార్ పనితీరుపై వస్తున్న విమర్శలు చేయడం తగదని , ఆయన విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయనకు మద్దతుగా మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజల సమస్యల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, రెవెన్యూ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించేలా తన బాధ్యతలను నిర్వహిస్తున్నారని పేర్కొంటున్నారు. మండలంలో వివిధ సందర్భాల్లో పేద ప్రజలు ఎదుర్కొన్న సమస్యల ఓపికగా వింటూ తగిన సూచనలు చేస్తూనే సమస్య పరిష్కారానికి ఆయన స్పందించిన తీరు, విధి నిర్వహణలో చూపుతున్న చొరవ ఆయన పనితీరుకు నిదర్శనమని ప్రజలు చెబుతున్నారు. అధికారిగా తన బాధ్యతలను నిర్వర్తించడంలో వృత్తి ధర్మానికి ప్రాధాన్యతనిస్తూ, నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకోవడానికి కృషి చేస్తున్నారని వివరిస్తున్నారు.

ప్రభుత్వాలు మారినా నాలుగేళ్లుగా ఒకే స్థానంలో సేవలు..

సాధారణంగా అధికారుల బదిలీలు, స్థాన మార్పులు జరుగుతుండే పరిస్థితుల్లో ఐనవోలు మండలంలో తహసీల్దార్‌గా విక్రమ్ కుమార్ నాలుగేళ్లుగా కొనసాగడం గమనార్హమని ఆయనకు మద్దతు తెలిపేవారు పేర్కొంటున్నారు. ఈ కాలంలో మండల ప్రజలతో సంబంధాలు కొనసాగిస్తూ, రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెబుతున్నారు.

పైరవీలకు తావులేని పాలనకు ప్రాధాన్యత..

రెవెన్యూ శాఖలో భూములు, పట్టాదారు హక్కులు, ఇతర భూ సంబంధిత అంశాలు ప్రజల జీవితాలతో ముడిపడి ఉంటాయి. ఇలాంటి సున్నితమైన విషయాల్లో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడం, పారదర్శకత పాటించడం అత్యంత కీలకం. ఈ అంశాలకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహిస్తున్నారనే అభిప్రాయం ఆయనకు మద్దతుగా వినిపిస్తోంది.

వ్యక్తిగత విమర్శల కంటే పనితీరుపైనే చర్చ జరగాలి.

ప్రభుత్వ అధికారులు విధులు నిర్వహిస్తున్నప్పుడు వివిధ వర్గాల నుంచి విమర్శలు రావడం సహజం. అయితే, విమర్శలు వాస్తవాలు, ఆధారాల ప్రాతిపదికన ఉండాలని, వ్యక్తిగత ఆరోపణల కంటే అధికారుల పనితీరును నిష్పక్షపాతంగా పరిశీలించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



తహసీల్దార్ విక్రమ్ కుమార్‌పై వస్తున్న ఆరోపణలను పరిశీలించేటప్పుడు కూడా వాస్తవాలు, ఆధారాలు, సంబంధిత రికార్డుల ఆధారంగానే నిర్ణయానికి రావాలని పలువురు సూచిస్తున్నారు. ప్రజలకు అందే సేవలే అధికారుల పనితీరుకు గీటురాయి. ప్రజా సమస్యల పరిష్కారం, నిబంధనల అమలు, పారదర్శక నిర్ణయాలు, బాధ్యతాయుతమైన పరిపాలన ద్వారా అధికారుల పనితీరు అంచనా వేయాల్సి ఉంటుందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

భక్తిపారవశ్యంలో మహిళలు.. అమ్మవారి దీక్షలో యువతులు

- భైంసాతో పాటు పలు గ్రామాల్లో నవరాత్రి దీక్షలు

- నియమ నిష్ఠలతో పూజలు.. ఉపవాసాలతో అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థనలు

నిర్మల్,అక్టోబర్ 13(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భైంసా పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో అమ్మవారి దీక్షలు స్వీకరించి ఆధ్యాత్మిక బాటలో పయనిస్తున్నారు. అమ్మవారిపై అపారమైన భక్తివిశ్వాసాలతో కఠిన నియమ నిష్ఠలను పాటిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉపవాసాలు, నైవేద్యాల సమర్పణతో అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థిస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోతున్నారు.

నిష్ఠతో పూజలు.. భక్తితో ఉపవాసాలు...నవరాత్రి దీక్షలు స్వీకరించిన మహిళలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ అలంకరణల్లో అమ్మవారిని దర్శించుకుంటూ పూలు, పండ్లు, ఇతర నైవేద్యాలను సమర్పిస్తున్నారు. దీక్షలో భాగంగా ఉపవాసాలు పాటిస్తూ దైవచింతనలో గడుపుతున్నారు. సంప్రదాయ ఆచారాలకు అనుగుణంగా నియమబద్ధమైన జీవనశైలిని అనుసరిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

యువతుల్లోనూ పెరుగుతున్న ఆధ్యాత్మిక ఆసక్తి...

భైంసా పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో యువతులు సైతం అమ్మవారి దీక్షలు స్వీకరించి నిష్ఠతో కొనసాగించడం విశేషం. నిత్యజీవితంలో చదువులు, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే దీక్షా నియమాలను పాటిస్తున్నారు. పాదరక్షలు ధరించకుండా నడవడం, సాత్విక ఆహారం తీసుకోవడం, ఉపవాసాలు పాటించడం వంటి నియమాలను



ఆచరిస్తున్నారు. భక్తిమార్గంలో నడవడం ద్వారా ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ అలవడతాయని వారు విశ్వసిస్తున్నారు.

ఆత్మనిగ్రహానికి ప్రతీకగా దీక్షలు...

దేవి నవరాత్రి దీక్షలు కేవలం పూజలకే పరిమితం కాకుండా ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతతకు ప్రతీకగా నిలుస్తాయని భక్తులు భావిస్తున్నారు. నియమ నిష్ఠలతో కూడిన ఆధ్యాత్మిక జీవనం మనసును ప్రశాంతంగా ఉంచుతుందని నమ్ముతున్నారు. అమ్మవారి కృపతో కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నారు. భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సమ్మేళనంగా కొనసాగుతున్న నవరాత్రి దీక్షలు పట్టణంతో పాటు గ్రామాల్లోనూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపుతున్నాయి.

తూడుకుర్తిలో న్యాయ విజ్ఞాన సదస్సు

చట్టాలపై అవగాహనతోనే నేరాల నియంత్రణ - జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిహారిక

నాగర్ కర్నూల్, అక్టోబర్ 12 (ప్రజా కలం): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తూడుకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిహారిక ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు వెల్లడించవద్దని, మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని నియమించుకోలేని అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ప్రజలు తమ న్యాయపరమైన సమస్యలు, సందేహాల పరిష్కారం కోసం న్యాయ సేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సదస్సులో భాగంగా ప్రజలకు ఎదురవుతున్న న్యాయపరమైన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, గ్రామ సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తానూర్ మండలంలో
ఘనంగా బతుకమ్మ సంబురాలు..



తానూర్, అక్టోబర్ 12(ప్రజా కలం): మండల కేంద్రమైన తానూర్ తోపాటు కోలూర్,మొగిలి,బోల్సా,భోసి, తదితర గ్రామాలలో సోమవారం బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ సంబురాలను ప్రారంభించారు, మహిళలు తీరొక్క రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు, అనంతరం బతుకమ్మలతో శోభాయాత్ర నిర్వహించి, ఒకచోట చేరి సాంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడారు, నైవేద్యంగా సత్తుపిండి (పుంజులు) సమర్పించిన తర్వాత భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను సమీప చెరువులో నిమజ్జనం చేశారు,పుట్టింటికి చేరుకున్న ఆడపడుచుల రాకతో గ్రామాలలో పండుగ శోభ సంతరించుకుంది, ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు,ప్రజాప్రతినిధులు,నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న బాధితుడు రాజును పరామర్శించిన ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ అక్టోబర్ 12 (ప్రజా కలం): నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేశిటిక్యాల గ్రామానికి చెందిన అచ్చుత రెడ్డి కుమారుడు రాజును నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చేరిన రాజు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజుకు అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుతం రాజు ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు సంబంధించిన అంశాలపై కుటుంబ అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని, ఆయన ఆరోగ్యం పట్ల ఆరా తీశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ కుమారుడిని ఎమ్మెల్యే పరామర్శించడంతో బాధితుడి కుటుంబ సభ్యులకు ధైర్యం ఉండాలని వారికి భరోసా కల్పించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాల్సిన అవసరం ఉందన్నారు



పోట్రు కుటుంబాన్ని పరామర్శించిన సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు




తల్లాడ అక్టోబర్ 12 ప్రజా కలం న్యూస్ తల్లాడ మండలంలోని పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్రూ శ్రీనివాసరావు కుటుంబాన్ని తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ) పరామర్శించారు. సోమవారం పోట్రూ శ్రీను తండ్రి ప్రకాష్ రావు ఇటీవల మృతి చెందటంతో ఆయన దశదినకర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొమ్మినేని హాజరై ప్రకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో నాయకులు పేరసాని నరసింహారావు, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్. యాకుబ్ పాషా, పడాల లక్ష్మణ్ ఉన్నారు.

తాడూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న డిమాండ్

నాగర్ కర్నూల్ అక్టోబర్ 12 ప్రజా కలం (ప్రతినిధి): వర్షా బావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం తాడూర్ మండల కార్యదర్శి అంతటి కాశన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం నాడు నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని 24 గ్రామాలలో పర్యటించి అయన రైతులతో మాట్లాడి నష్టపోయిన పరిస్థితిని రైతుల ఆవేదనను తెలుసుకున్నారు. నష్టపోయిన పంటలను గుర్తించి తగిన అంచనా వేసి సమగ్ర నివేదిక రూపొందించాలని మండల పరిషత్ కార్యాలయం నందు ధర్నా నిర్వహించారు అదేవిధంగా మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలని డిమాండ్ చేశారు.అర్హులైన రైతులకు ప్రభుత్వం నిబంధన ప్రకారం పంట నష్టపరిహారం ఆర్థిక సాయం అందించడంతో పాటు పశువులకు పచ్చిమేత అందజేయాలని కోరారు. ఇప్పటికే పంట దిగుబడి లేక పురుగు మందులు ఎరువులు కూలీల ఖర్చు అధికమై అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనలకు గురవుతున్నారని అన్నారు. రైతులు వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక వారి జీవన పరిస్థితి దయనీయంగా ఉందని వెంటనే తగు చర్యలు తీసుకొని ఉపాధి పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించే వరకు వారి వెంట ఉండి నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాసన్నతో పాటు హనుమంతు వెంకటయ్య హుస్సేను రాములు వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఇళ్లను కూల్చివేసి రోడ్డున పడేశారు

కలెక్టర్‌ను ఆశ్రయించిన శాత్రాజ్‌పల్లి బాధితులు
ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారని బాధితుల ఆవేదన
మంత్రి శ్రీధర్‌బాబు స్పందించాలని బాధితుల డిమాండ్





భూపాలపల్లి, అక్టోబర్ 12 (ప్రజాకలం ప్రతినిధి):

తాడిచర్ల పరిధిలోని శాత్రాజ్‌పల్లి బ్లాక్-2 సింగరేణి బొగ్గు గని ప్రాంతంలో అర్ధరాత్రి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చివేశారని బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేశారు. తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు చేరుకున్న బాధితులు వినతిపత్రం అందజేసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.తమ ఇళ్లను కూల్చివేయవద్దని అధికారుల కాళ్లావేళ్లా పడి వేడుకున్నా కనికరించకుండా కూల్చివేయడం అన్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బంగారం కుదువపెట్టి, అప్పులు చేసి రూ.4 నుంచి 5 లక్షలు ఖర్చు చేసి నిర్మించుకున్న ఇళ్లను అర్ధరాత్రి కూల్చివేయడంతో రోడ్డున పడ్డామని వాపోయారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్లను కూల్చివేయడానికి ఏ చట్టం అనుమతిస్తుందని ప్రశ్నించారు. సింగరేణి రాకతో తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని భావిస్తే, తమ బతుకులను చీకట్లోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయకుంటే ఊరుకునేది లేదని, ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అంతకుముందు కలెక్టరేట్‌కు వచ్చిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి బాధితులు తమ గోడు వెళ్లబోసుకుని న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన కలెక్టర్ రాహుల్ శర్మతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్-2 బాధితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌కు జాతీయ అవార్డు

పీఎం ధన్-ధాన్య కృషి యోజన అమలులో జాతీయ గుర్తింపు
కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డు
స్వీకరించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 12: వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయం పెంపు, పంటల ఉత్పాదకత మెరుగుదల లక్ష్యంగా అమలు చేస్తున్న పీఎం ధన్-ధాన్య కృషి యోజనలో నాగర్‌కర్నూల్ జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఈ పథకం అమలులో జిల్లాకు లభించిన గుర్తింపులో భాగంగా న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ జాతీయ అవార్డును స్వీకరించారు. ఢిల్లీలోని ఎన్ఎస్‌సీ కాంప్లెక్స్‌లో పీఎం ధన్-ధాన్య కృషి యోజన అమలులో ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి మైలురాయి వేడుకల్లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డును అందుకున్నారు. ఈ పథకం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటల ఉత్పాదకతను మెరుగుపరచడం, సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేస్తూ రైతులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ జాతీయ స్థాయి వేడుకలకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నలుగురు సభ్యుల ప్రతినిధి బృందం హాజరైంది. ఈ బృందంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఓ. శైలా, ప్రగతిశీల రైతు రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయ అభివృద్ధి, రైతుల ఉత్పాదకత పెంపు దిశగా నాగర్‌కర్నూల్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం విశేషం. ఈ అవార్డు జిల్లాలో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, రైతుల సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలకు ప్రోత్సాహాన్నిస్తుందని భావిస్తున్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి

- స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 12:


వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వెట్టిచాకిరీకి గురవుతున్నచేయండి కార్మికులను గుర్తించి, వారికి విముక్తి కల్పించడంతో పాటు తగిన పునరావాసం అందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీల వంటి అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులను పరిశీలిస్తూ, వెట్టిచాకిరీ బాధితులను గుర్తించడంలో సంబంధిత శాఖల అధికారులు చురుగ్గా వ్యవహరించాలని పేర్కొన్నారు. 'స్వేచ్ఛా రథం' జిల్లావ్యాప్తంగా పర్యటిస్తూ వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కులు, కార్మికులపై జరిగే దోపిడీని అరికట్టే మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించనుంది. సమాచార, విద్య, ప్రచార సామగ్రి ద్వారా కార్మికులకు చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ రక్షణ వ్యవస్థలపై చైతన్యం కల్పించనున్నారు. వెట్టిచాకిరీ లేదా కార్మికుల దోపిడీకి సంబంధించిన సమాచారం అందించేందుకు, సహాయం పొందేందుకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 080-69434343 ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈ ప్రచార కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సాయి శివానీ,కార్మిక శాఖ ఇంచార్జి అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్ అల్తాఫ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృతురాలు కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు దామాల రవి



పాలేరు అక్టోబర్ 12(ప్రజా కలం న్యూస్)ఖమ్మం పట్టణ పరిధిలోని 59 డివిజన్ దానవాయిగూడెం కి చెందిన. మద్దెల హుస్సేన్ అమ్మ మృతి చెందిన విషయాన్ని పాలేరు మాజీ శాసన సభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి, అభిమాని, బెల్లం వేణు గోపాల్, అనుచరుడు 59వ డివిజన్ బి.ఆర్.యస్ పార్టీ. మాజీ అధ్యక్షులు దామాల రవన్న తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి దశదిన కార్యక్రమానికి ఆర్థిక సహాయం 5.000/- రూపాయలు ఇవ్వడం జరిగింది. దామాల రవి, వారి కుటుంబాన్నీ ఓదార్చి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఎల్లవేళలా మీ కుటుంబానికి బి.ఆర్. యస్ పార్టీ, నేను అండగా ఉంటానని, ఏ ఆపద వచ్చిన ఆదుకుంటామని వారికి ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో 59 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లూరి మధుబాబు, అనబత్తుల వెంకటేశ్వర్లు, మద్దెల ఉపేందర్, నాగటి బిక్షం. సామిరెడ్డి లింగారెడ్డి. ఇళ్లప్రోలు సీతారాములు.బొంతల అశోక.వెంపటి సంతోష్.బత్తుల రవి,మరపాక కరుణాకర్,కొట్టే పాపారావు, జాల కోటయ్య, బత్తుల వెంకన్న, నాగంటి. సంగయ్య. గురుమూర్తి, షేక్ నాగులమీరా, పసుపులేటి కృష్ణ,జానీ,మద్దెల ఉదయ్, చిటిక వినయ్, దార నాగరాజు, మద్దెల వినయ్. షేక్ అంజాద్, దామాల ప్రసాద్.మట్టపల్లి ఉదయ్,ఎస్ కె రసుల్. వెలుపుల మల్లి కార్జున్. పెండ్రా ప్రసాద్. బండి శ్రీకాంత్. వల్లెపు ప్రవీణ్. బండి కార్తీక్. రాజేష్. నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువల సంచారంతో తానూర్ మండల రైతాంగం తీవ్ర ఆందోళన



తానూర్,అక్టోబర్ 12(ప్రజా కలం): మండల కేంద్రంతో పాటు తొండాల గ్రామ శివారులోని సోయా పంట పొలాల్లో వరుసగా భారీ కొండచిలువలు దర్శనమివ్వడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు, రెండ్రోజుల వ్యవధిలో రెండు ప్రాంతాల్లో పాములు కనిపించడంతో అన్నదాతలు అప్రమత్తమయ్యారు, పొలాలకు వెళ్లేవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, పాములు కనిపిస్తే స్వయంగా పట్టుకునే సాహసం చేయకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన కోడూరు వీరకృష్ణ..



తల్లాడ అక్టోబర్ 12 (ప్రజా కలం న్యూస్):

తల్లాడ మండలంలోని రంగంబంజర గ్రామానికి చెందిన ప్రముఖ మామిడికాయల వ్యాపారివేత్త షేక్ ఇస్మాయిల్ కుమారుడు షేక్ ఖరీమ్ కు నేహాతో వివాహం కోదాడ పట్టణం రంగా సీతమ్మ గారి ఫంక్షన్ హాల్ లో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కోడూరి వీరకృష్ణ హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్ విలసాగరం వెంకటరావు, విలసాగరం శ్రీనివాసరావు, కోడూరి సత్యనారాయణ, రంగారావు పాల్గొన్నారు.

మైనార్టీ అధ్యక్షులు నిజాముద్దీన్ కు ముస్లింల ఆధ్వర్యంలో ఘన సన్మానం..



తల్లాడ అక్టోబర్ 12 ప్రజా కలం న్యూస్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ తల్లాడ మండల అధ్యక్షులుగా నియామకం అయిన షేక్ నిజాముద్దీన్ కు సోమవారం తల్లాడ ముస్లిం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముస్లిం మత పెద్దలు సదర్ అక్బర్, మౌలానా, ముజిద్ రెహమాన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ఆయనను శాలువాలతో సన్మానించి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ముస్లింలకు ఈ పదవి రావడం హర్షనీయమన్నారు. ముస్లింల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ముస్లింలను గుర్తించి ఈ పదవి ఇవ్వటం పట్ల ముస్లిం సోదరులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు ఎండి ముస్తఫా, పటాన్ నాగులుమీరా, ఏస్కూర్ షేక్ నిజాముద్దీన్, డాక్టర్ సైదా ఖాజా మియా, షేక్ చాంద్ పాషా, జానీ, షేక్ జానీమియా, కాసింసా గిడ్డే, మాజీ నాయక్ సదర్ షేక్ మెహరాజ్, షేక్. సైదులు తదితరులు పాల్గొన్నారు.

మొగిలి లో కన్నుల పండుగ బతుకమ్మ సంబురాలు

తానూర్,అక్టోబర్ 12(ప్రజా కలం): మండలంలోని మొగిలి గ్రామంలో సోమవారం బతుకమ్మ పండుగ పండుగను నిర్వహించారు,ఈ సంబురాలను సర్పంచ్ ఉషా - దర్శన్ యాదవ్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు, మహిళలు రంగురంగుల పులతో బతుకమ్మలను పేర్చి శోభాయ(త్రాలో పాల్గొని బతుకమ పాటలు పాడుతూ,బతుకమ్మ ఆడారు,బతుకమ్మలకు పుంజులను చేసి సమీప వాగులో నిమజ్జనం చేశారు,గ్రామంలో ఆడపడుచులు రాకతో బతుకమ్మ శోభా ఆగు పడింది,ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లచ్చన్న,లక్ష్మణ్,నాయకులు శాదుల్,మోహన్, బి.శ్రీనివాస్, ఎం.సుభాష్ ,ఎం.మానిక్, బి. లక్ష్మణ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు..

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నిర్మల్ అక్టోబర్ 12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలోని బాసర రైల్వే స్టేషన్‌లో రైల్వే గూడ్స్ రేక్ పాయింట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే రైతులు, వ్యాపారులు, స్థానిక ప్రజలకు సరుకు రవాణాలో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. బాసర రైల్వే స్టేషన్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను వినియోగించుకుంటూ, అవసరమైన గూడ్స్ సైడింగ్, సరుకుల లోడింగ్-అన్‌లోడింగ్ సదుపాయాల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జనరల్ మేనేజర్‌ను ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ విన్నపంపై జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదనపై సంబంధిత అధికారుల నుంచి నివేదిక తెప్పించుకొని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రకాష్ రావుకు నివాళులర్పించిన సంద్ర వెంకట వీరయ్య..



తల్లాడ, అక్టోబర్ 12 (ప్రజాకలం న్యూస్):

తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన ప్రోటు శ్రీనివాసరావు తండ్రి ప్రోటు ప్రకాష్ రావు ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆయన దశదిన కార్యక్రమం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సంద్ర వెంకట వీరయ్య హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించినారు. అనంతరం కుటుంబ సభ్యులందరికీ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, తల్లాడ బి ఆర్ ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు జీవిఆర్, తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, నాయుడు శ్రీనివాసరావు, మిట్టపల్లి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాగంటి నాగులు , గంగాదేవిపాడు సొసైటీ మాజీ డైరెక్టర్ జంగా చిన్న వెంకట రెడ్డి, మాజీ ఎంపీటీసీ కోపిల కనకయ్య, చల్లా వేంకటేశ్వర రావు, మండేపూడి ప్రసాద్, గోపిశెట్టి ప్రసాద్, అమరనేని నాగయ్య, కొండ బసవయ్య, కొండ యేశోబు, కందుల వెంకటి పాల్గొన్నారు..

ప్రకాష్ రావుకి నివాళులర్పించిన వైస్ చైర్మన్ కాపా సుధాకర్..



తల్లాడ, అక్టోబర్ 12 (ప్రజా కలం న్యూస్): తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రోటు శ్రీను తండ్రి ప్రోటు ప్రకాష్ రావు దశదిన కార్యక్రమానికి వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా. సుధాకర్ హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి కుటుంబ సభ్యులందరికీ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. నివాళులర్పించిన వారిలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపా. మహేష్, గొల్లగూడెం మాజీ సర్పంచ్ గుండ్ల. వెంకటేశ్వర్లు, చిన్నంశెట్టి శ్రీకాంత్, ముప్ప కృష్ణార్జున, షేక్.జమాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 34 శాతం టికెట్లు ఇచ్చి తీరుతాం

అమరావతి, అక్టోబర్ 9: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కేటాయించేందకు తాము కట్టుబడి ఉన్నామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గల్లా మాధవి స్పష్టం చేశారు.మీడియాతో మాట్లాడుతూ.. సాంకేతికంగా ఇబ్బంది వచ్చినా... పార్టీ పరంగా బీసీలకు 34 శాతం టిక్కెట్లు ఇస్తుందని తెలిపారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లను ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసింది చంద్రబాబే అని చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో బీసీ నాయకత్వాన్ని అభివృద్ధి చేసింది టీడీపీనే అనేది మరిచిపోవద్దన్నారు. బీసీలకు ప్రభుత్వం మంచి చేయాలనుకుంటే గొడ్డలి పార్టీ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటూ దాఖలైన పిటిషన్‌కు అనుకూలంగా వాదనలు వినిపించిన న్యాయవాది వైసీపీ ప్రభుత్వంలో ఏజీపీగా వ్యవహరించారని మాధవి తెలిపారు. వైసీపీ నేతే బీసీలకు వ్యతిరేకంగా వాదనలు వినిపిస్తోంటే ఎందుకు ఆ పార్టీ ఆపలేదో సమాధానం చెప్పాలన్నారు. బీసీలను రాజకీయంగా వాడుకోవడమనేది గొడ్డలి పార్టీకి అలవాటని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చేసిన స్కాంలకు వైసీపీ బీసీ నాయకులను రక్షణగా పెట్టుకున్నారన్నారు. గొడ్డలి పార్టీ వల్ల అనేక మంది బీసీ నేతలు కేసుల్లో ఇరుక్కున్నారని.. గత ప్రభుత్వం బీసీ నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. బీసీలకు గొడ్డలి పార్టీ చేసిన ద్రోహాన్ని బీసీలు మరిచిపోలేదని... మరిచిపోరని గల్లా మాధవి పేర్కొన్నారు.

పైపులైన్లు లీకులతో తాగునీటికి అవస్థలు

ఎల్.ఎన్.పేట : మండలంలోని 22 పంచాయతీల పరిధిలోగల గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు లక్ష్మీనర్సుపేట సమీ పంలోని వంశధార నది ఒడ్డున మెగా రక్షిత నీటి పథకం ఏర్పాటుచేసినా పైపు లైన్ల లీకుల పుణ్యమాని వర్షాకాలంలోనూ తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. అధికారులు లీకులమయమైన పైపులైన్లకు మరమ్మతులు చేసి రక్షిత నీటి పథకం ద్వారా తాగునీరందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిర మండలం, ఎల్.ఎన్.పేట మండలాల ప్రజలకు ఉద్దానం నీటి పథకం ద్వారా నీరందించేందుకు యంత్రాలతో పైపులైన్లు వేసేందుకు పనులు చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా వంశధార నది ఒడ్డున ఉన్న మెగా రక్షిత నీటి పథకానికి సంబం ధించిన పైపులైన్లు అడుగడుగునా పాడయ్యాయి. అవి లీకులు కావడంతో 22 పంచా యతీల్లోని గ్రామాలకు తాగు నీరందని పరిస్థితి నెలకొంది. దీంతో పలు గ్రామాల ప్రజలు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో తురకపేట, దబ్బపాడు, స్కాట్‌పేట, కృష్ణాపురం, శ్యామలాపురం, డొంకల బడవంజ, సుమంతాపురం, ఉప్పరపేట తదితర గ్రామాల ప్రజలు వర్షాకాలంలోనూ తాగునీటికి ఇబ్బందిపడుతున్నారు.

చెప్పింది చేయడమే లక్ష్యం

టెక్కలి : 'మాటిచ్చామంటే చాలు వాటిని అమలుచేసి తీరుతాం. చెప్పింది చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం. అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తుంది' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలిలో రూ.2 కోట్ల 60 లక్షలతో టెక్కలి నుంచి పోలవరం వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందని, కూటమి ప్రభుత్వం బాధ్యతగా మౌలిక సదుపాయాలు కల్పనలో ముందువరుసలో ఉందని తెలిపారు. రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బగాది శేషగిరి, ఎల్ఎల్ నాయుడు, లవకుమార్, హను మంతు రామకృష్ణ, పోలాకి షణ్ముఖరావు, మామిడి రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, ఆర్‌అం డ్‌బీ ఎస్‌ఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణ.. నేరస్తులకు శిక్ష.. విధి నిర్వహణలో ప్రతిభకు గుర్తింపు

- ఇదే యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ లక్ష్యం - విధి నిర్వహణలో విశేష ప్రతిభ..

120 మంది పోలీస్ సిబ్బందికి ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ప్రశంసా పత్రాలు

- బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సంచలనాత్మక హత్య కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసుల కృషికి మరియు నేరాల ఛేదన,కోర్టుల్లో శిక్షలు పడేలా కృషి,సైబర్ నేరాల నియంత్రణ,గణేష్ బందోబస్తులో అంకితభావంతో పనిచేసిన సిబ్బందికి అభినందనలు



బొమ్మలరామారం,
అక్టోబర్ 12 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖలో విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ కనబరిచి,నేరాల నియంత్రణ,కేసుల దర్యాప్తు, న్యాయస్థానాల్లో నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో విశేష సేవలు అందించిన మొత్తం 120 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందిం చారు. ముఖ్యంగా తుర్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా న్యాయవాదన చేసిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ రెడ్డిని, భువనగిరి కోర్టులో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ ఎస్పీ అభినందిం చారు అదేవిధంగా బొమ్మల రామారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సంచలనాత్మక హత్య కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసుల కృషితో పాటు, గుండాల పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఎస్సీ/ఎస్టీ కేసులో నిందితుడికి శిక్ష పడేలా న్యాయపరంగా కృషి చేసిన నల్గొండ ఎస్సీ/ఎస్టీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ దర్శనం నర్సింహను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు, వివిధ సైబర్ నేరాలను ఛేదించడంలో చురుకైన పాత్ర పోషించి బాధితులకు న్యాయం అందించేందుకు కృషి చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత,వృత్తి నైపుణ్యం కనబరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అభినందనలకు అర్హులు అని అన్నారు నేరస్తులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన దర్యాప్తు,పటిష్టమైన న్యాయవాదన ఎంతో కీలకం అని అన్నారు ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేసే సిబ్బంది సేవలను గుర్తించి ప్రోత్సహించడం పోలీస్ శాఖ బాధ్యత అని అన్నారు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలి" అని సూచించారు.



అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ప్రజాస్వామ్య గొంతుకను నొక్కుతున్న మోడీ ప్రభుత్వం-- ర్యాకల శ్రీశైలం

బొమ్మలరామారం అక్టోబర్ 12 (ప్రజా కలం)

ప్రజాస్వామ్య బద్దంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తు ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సిపిఎం జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు కేంద్ర కమిటీ సభ్యులు ఆల్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ, ప్రజలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం బొమ్మలరామారం మండల కమిటీ తీవ్రంగా ఖండించింది సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రోజున సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బొమ్మలరామారం బస్టాండ్ చౌరస్తా లో ఢిల్లీలో సిపిఎం జాతీయ నాయకులను మరియు ప్రజల అరెస్టులను నిరసిస్తూ నిరసన తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం పాల్గొని మాట్లాడుతూ దేశంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలు నిరసనలకు దిగితే వారి ఆందోళనలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం అణిచివేతకు పాల్పడడం దుర్మార్గమని మండిపడ్డారు ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని ప్రజలు తమ పాలకులను ఎన్నుకునే అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని అన్నారు ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉన్నది అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా అనహర్వులకు అవకాశం కల్పించకుండా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాల్సిన అవసరం ఉంది ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉన్నది ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులను విఘాతం కలిగించే చర్యలు చేపట్టడం సరైనది కాదని అన్నారు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను రాజీనామాచేయాలి ఎస్ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేసి ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ,హరిప్రసాద్ , హీరావత్ విజయ, ధీరావత్ రమేష్, రాంపల్లి శ్రీహరి, ఊట్ల శంకరయ్య, పండుగ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

బీరప్ప స్వామి ఆలయానికి భూమి పూజ



భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 12 (ప్రజా కలం):

పోచంపల్లి మండలంలోని పెద్దరావుపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి, కామరతి దేవి ఆలయ నిర్మాణానికి కుర్మ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోటె బాలకృష్ణ, కుర్మ సంఘం అధ్యక్షుడు మోటె రమేష్, ముఖ్య అతిథులుగా రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు క్యామ మల్లేష్, పోచంపల్లి సింగిల్ విండో చైర్మన్ పాక మల్లేష్ యాదవ్,మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉమ్మనూతల వెంకటేష్ యాదవ్, పాల్గొన్నారు.కురుమ సంఘం ఉపాధ్యక్షులు మోటె రాజు, మోటె బాల మహంకాళి, చేగూరి ప్రభాకర్, కార్యదర్శి బుడిగె అంజనేయులు, కోశాధికారి మోటె పాండు, సహాయ కార్యదర్శులు పోలెమోని విజయ కుమార్ యాదవ్, మోటె బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు మోటె పర్వతాలు, మోటె పాండు, మోటె శేఖర్, మోటె నర్సింహ్మ, మోటె శంకరయ్య, మోటె కుమార్, బుడిగె గతేష్, మోటె నాగరాజు, గుల్లం బాలయ్య, పోలమోని చంద్రయ్య యాదవ్, మోటె జంగయ్య, పెద్ద కుర్మ మోటె కిష్టయ్య, సెలవోజీ గుల్లం అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐ లను సన్మానించిన బీజేపీ నాయకులు



బీబీనగర్, అక్టోబర్ 12 (ప్రజాకలం): స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ సూర్య నాయక్, ఎస్ఐ తేజారెడ్డిలను మండల బీజేపీ అధ్యక్షుడు సదానంద గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సూర్య నాయక్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా సేవలందించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోయపల్లి గోపాల్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ముష్కి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సురకంటి హరిప్రసాద్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు కాసుల శ్రీకాంత్ గౌడ్, గూడూరు శ్రీనివాసరెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధులు నకిర్తి శ్రీకాంత్, నిమ్మల శివ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 12 (ప్రజా కలం)

పోచంపల్లి పట్టణంలోని పెద్ద చెరువు వద్దగల శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాల నడుమ వైభవంగా ప్రారంభమైంది.



ఆశ్వయుజ శుద్ధ విదియను పురస్కరించుకుని ఉదయం అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ఠ, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముప్పిడి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఇబ్రహీంపట్నం అంజయ్య, గుణంగారి దినేష్ రెడ్డి, పోతగల్లు దానయ్య, కొమ్ము లక్ష్మణ్, గౌరవ సలహాదారులు బొక్క బాల్ రెడ్డి, కోయ్యడ నరసింహ, గునిగంటి మల్లేష్, చేరాల నరసింహ, ఉపాధ్యక్షులు మెరుగు బాలకృష్ణ యాదవ్, కేసారం బాల్ రెడ్డి, నల్ల నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి దోడ్డమోని దినేష్ యాదవ్, సహాయ కార్యదర్శులు సంకు నరసింహ, గోర్కంటి బాలయ్య, దొడ్డమోని ప్రభాకర్, కోశాధికారి మోటే మహేష్, వంగూరి సైదులు, కొమ్ము చంద్రయ్య, సాంస్కృతిక కార్యదర్శి సొల్లు శంకరయ్య, సహాయ సాంస్కృతిక కార్యదర్శి సైదులు సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని అభినందించిన జిల్లా ఎస్పీ

వలిగొండ అక్టోబర్ 12 ప్రజాకలం:ఇటీవల లారీలను టార్గెట్ చేస్తూ డీజిల్



దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను చాకచక్యంగా పట్టుకున్న వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని,పోలీస్ సిబ్బందిని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ అభినందించారు.ఈ సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి,సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

సుజాతనగర్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు అయిన సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు హాజరైన పత్రికా విలేకరుల సమావేశంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సుజాతనగర్ కు మంజూరు చేయించడంలో సహకరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, తుమ్మల నాగేశ్వరరావు కి, అలాగే ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి కి, రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ పబ్లిక్ స్కూల్ విద్యా విధానం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్య అందుతుందన్నారు.ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో సుజాతనగర్ కు ఈ పాఠశాల రావడం ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరినట్లేనని, దీనివల్ల కొత్తగూడెం, సుజాతనగర్ పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.



రంగంపేటలో ఘనంగా సామూహిక కుంకుమార్చన

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

కొల్చారం, అక్టోబర్ 12 (ప్రజాకలం ప్రతినిధి)

మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి సన్నిధిలో రంగంపేట గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నేతిని శ్రీనివాస్ దంపతులు మరియు గ్రామ భక్తులు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీ గాయత్రీ దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. భక్తులు భక్తిపారవశ్యంతో పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

మోర్తాడ్‌లో హోరెత్తిన ఈవీఎం హఠావో-దేశ్ బచావో' నినాదం!

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 12:

మోర్తాడ్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న దేశవ్యాప్త నిరసనకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అట్టి న్యాయమైన డిమాండ్ కోసం విద్యార్థి లోకం మహిళలు, సామాన్య పౌరులు చేపట్టిన నిరసనలో అనేక మందిని డిటెన్ చేయడం అప్రజాస్వామికం. అనేక నిరసనకారులపై విధించిన అక్రమ కేసుల్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు, దానిని కాలరాయడం కేంద్ర ప్రభుత్వం తీరు సరైనది కాదని విమర్శించారు. శాంతియుత వాతావరణం కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మరోవైపు ఓట్ చోరికి మూల కారణం ఈవిఎం మెషీన్ కావున లిఈవిఎం హటావో దేశ్ బచావో" అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు అంగుళి మాలజీ, డీఎస్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కాన్సిరాం మాల, జాంబవ చమార్, కాశీరాం మైనారిటీ యువకులు పాల్గొన్నారు.



ముంబై భవండి నవీముంబై ఉద్యమకారులు త్వరలో కెకె కమిటితో భేటీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 12:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన ఉద్యమకారుల సమావేశం ఆదివారం విలేపార్లేలో ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటిజెఏసి) ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో అన్ని సంఘాల నాయకులు మాట్లాడుతూ కెకె కమిటి (ఉద్యమకారుల గుర్తింపు కమిటి) సూచించినవి తమ వద్ద ఉన్నాయని, మరింత వాటిని సమీకరిస్తున్నామని నిర్వాహకులు తెల్పారు. తమను ఉద్యమకారులుగా గుర్తించి, న్యాయం కోసం త్వరలో హైద్రాబాద్ వెళ్ళి కమిటి ముఖ్యులతో భేటీ కానున్నట్లు సర్వ సమ్మతితో నిర్ణయం తీసుకున్నారు. చాలా రోజుల తర్వాత నిజమైన ఉద్యమకారులు ఏకతాటిపై కల్వడం చాలా సంతోషకరమని అందరు ఉల్లాసించారు. ఎంటిజెఏసి లో భాగస్వామ్యమైన ముంబై భివండి నవీముంబై లకు చెందిన ఉద్యమ సంస్థలు ఖార్ బాంద్రా కార్మిక సంఘం, కురుమ సంఘం నేత జూకంటి రామచందర్, గవ్వల శ్రీనివాస్, బెస్త గంగపుత్ర సంఘం ముంబై నేత మంగలిపెల్లి శ్రీనివాస్, భివండి పద్మశాలి సంఘం నాయకులు సిరిపురం తిరుపతి, జైతెలంగాణ సేవ సంఘం నేత రవి నాయక్, మల్లేష్ రజక, అదానీ కంపెనీ కళాకారులు బొమ్మ రాములు, ఎలవేలు యాకారి, దోభిఘాట్ రజక సంఘం నేత తడ్కుపెల్లి నరేష్, తెలంగాణ కార్మిక యువజన సంఘం బోరివలి నేత నీరటి భూమన్న, గోరేగావ్ గంగపుత్ర సంఘం నేత రణవేణి లక్ష్మణ్, కాశవేని చంద్రన్న, బిఆర్ఎస్ నేతలైన శివరాజ్ బొల్లే, బద్ది గోపాల్, ఎంటిబిఎఫ్ నేతలు నాగసేన్ మాలజీ, రమేష్ చౌవల్, ఎంటిజెఏసి కన్వీనర్లు నారపాక లక్ష్మణ్, నాగేళ్ల దేవానంద్, మూలనివాసి మాలజీ తదితరులు పాల్గొన్నారు. చివర్లో అమరులైన బద్ది హేమంత్ కుమార్, ఉట్నూర్ రాజేష్, గాయకులు నాగరాజ్ లకు శ్రద్ధాంజలి ఘటించారు.



జర్నలిస్టులు, పోలీసుల సమన్వయంతోనే సమాజ రక్షణ: ఆర్మూర్ సీఐ కె.చంద్రశేఖర్ రెడ్డి



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 12:

జర్నలిస్టులు తమ విధులను పారదర్శకంగా నిర్వహిస్తూ, సమాజ రక్షణ కోసం పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆర్మూర్ పట్టణ ఎస్.హెచ్.ఓ (సీఐ) కొంగి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో జర్నలిస్టులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన ప్రతి జర్నలిస్టునూ వ్యక్తిగతంగా పలుకరిస్తూ పరిచయం చేసుకున్నారు. అనంతరం పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్న మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై తగిన సమాచారం అందిస్తూ, వాటి నిర్మూలనకు జర్నలిస్టులు పూర్తి స్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువవుతూ 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా సీపీ సాయి చైతన్య (ఐపీఎస్) ఆదేశాల మేరకు ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం తాము నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలోనూ, శాంతిభద్రతల రక్షణలోనూ ఆర్మూర్ సీఐతో పాటు సబ్-ఇన్స్పెక్టర్లు (ఎస్సైలు), పోలీస్ బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక పోలీస్ అధికారులతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేయాలి

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పంటల సాగుపై సూచనలు



బీబీనగర్, అక్టోబరు 12 (ప్రజాకలం): తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం బీబీనగర్ రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శోభారాణి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారుల సలహాల మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వర్షపాతం తగ్గే పరిస్థితులు ఉంటే నీటి ఎద్దడిని తట్టుకునే పంటలకు ప్రాధాన్యమివ్వాలని, అందుబాటులో ఉన్న సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టి, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌వో హరికృష్ణ, ఎంఏవో పద్మ, సూపరింటెండెంట్ హరి శివకుమార్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్ గా కుత్బుల్లాపూర్ చౌరస్తా తీర్చిదిద్దండి: ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ తో జోనల్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రోడ్ల విస్తరణ, సీఎంసీలో విలీనమైన శివారు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ నిర్వహణ, అస్తవ్యస్థంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....

కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాను ట్రాఫిక్ ఫ్రీ చౌరస్తాగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు.

అదేవిధంగా కొత్తగా ఏర్పాటైన సిఎంసి కార్పొరేషన్ లో విలీనమైన శివారు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, సివరేజ్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ప్రణాళిక బద్ధంగా శివారు సర్కిల్ ల పరిధిలో మౌలిక వసతులను చేపట్టి కొంపల్లి, నిజాంపేట్, దుండిగల్ సర్కిల్ లోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరచాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంతో పాటు పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలన్నారు.

ఈకార్యక్రమంలో ఉప కమీషనర్ శంకర్ సింగ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

తెలంగాణ తొలి అమరవీరుడికి సముచిత గౌరవం కల్పించాలి



బీబీనగర్, అక్టోబర్ 12 (ప్రజాకలం): వరంగల్ లోని మామునూరు విమానాశ్రయానికి తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని గొర్ల కాపరులు సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడిగా గుర్తింపు పొందిన దొడ్డి కొమురయ్య త్యాగాలను ప్రభుత్వం గుర్తించి, ఆయనకు సముచిత గౌరవం కల్పించాలని కోరారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన పోరాటంలో ఆయన చేసిన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ప్రాణాలర్పించిన దొడ్డి కొమురయ్య సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన పోషించిన పాత్రను గుర్తు చేసుకుంటూ, ఆయన పేరును మామునూరు విమానాశ్రయానికి పెట్టడం ద్వారా రాష్ట్ర చరిత్రకు, పోరాట స్ఫూర్తికి తగిన గుర్తింపు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. దొడ్డి కొమురయ్య త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల పేర్లను ప్రముఖ ప్రభుత్వ సంస్థలు, ప్రజా ప్రాజెక్టులకు పెట్టడం ద్వారా వారి సేవలను సమాజానికి మరింత చేరువ చేయవచ్చన్నారు. మామునూరు విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ఆయనకు సముచిత గౌరవం కల్పించాలని కోరారు.

హసకొత్తూర్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి: 16 మంది అరెస్ట్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 12:

కమ్మర్‌పల్లి మండల పరిధిలోని హసకొత్తూర్ గ్రామ శివారులో



రహస్యంగా సాగుతున్న పేకాట స్థావరంపై కమ్మర్‌పల్లి పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కమ్మర్‌పల్లి ఎస్సై నేతృత్వంలో రాత్రి ఈ సోదాలు జరిగాయి. గ్రామ శివారు ప్రాంతంలో కొందరు వ్యక్తులు గుంపులుగా చేరి పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు ఈ దాడులు చేపట్టారు.

ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 16 మందిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు వ్యక్తులు చీకట్లోకి పరారయ్యారు. నిందితుల వద్ద నుంచి రూ. 21,800 నగదుతో పాటు 15 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వారిపై చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకుంటున్నామని, పరారైన ఇద్దరి కోసం గాలిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

బతుకమ్మ వేడుకలో కుల వివక్షత

- దళిత,రెడ్డి సామాజిక వర్గాల మహిళల మధ్య వివాదం..

- ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఎదుట దళిత మహిళల ఆందోళన...

-ఎస్సీ,ఎస్టీ,అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్

యాదాద్రి అక్టోబర్ 12 ప్రజాకలం:ఏఐ టెక్నాలజీ కాలంలోనూ కుల వివక్షత



జాడ్యం మాత్రం పోవడం లేదు.బతుకమ్మ పండుగ వేళ,రెడ్డి కులస్తులు దళిత మహిళల పట్ల వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది.యాదాద్రి జిల్లా ఆత్మకూరు మండలం టి. రేపాక గ్రామంలో కుల వివక్షత ఘటన కలకలం రేపింది.మొన్న జరిగిన బతుకమ్మ వేడుకలలో దళిత,రెడ్డి,సామాజిక వర్గానికి చెందిన మహిళల మధ్య వివాదం రాజుకుంది.దళిత మహిళలు ఆడిన దగ్గర,తాము బతుకమ్మ ఆడబోమని రెడ్డి సామాజిక వర్గ మహిళలు అన్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.అలాగే వారు తెచ్చిన బతుకమ్మలు అక్కడి నుండి తీసుకెళ్లారు.కులవివక్షతో తమను అవమానించారని, దళిత మహిళలు ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు.తమను అవమానించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గొర్రెలు కోల్పోయిన కిష్టయ్యకు రూ.50 వేల సాయం- క్యామ మల్లేష్

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 12 (ప్రజా కలం): జూలూరు గ్రామ పరిధిలోని అలీనగర్ కు చెందిన బాలమోని కిష్టయ్య కుటుంబాన్ని రాష్ట్ర గొల్ల కురుమ సంఘం అధ్యక్షుడు క్యామ మల్లేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత

కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. రైలు ప్రమాదంలో 350కు పైగా గొర్రెలు మృతి చెందడంతో నష్టపోయిన కిష్టయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని క్యామ మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పార్టీ సుధాకర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, యాదవ సంఘం నాయకుడు అయోధ్య, , అందేలా హరీష్ యాదవ్,యాకరి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ సర్కిల్ ఫుడ్ సేఫ్టీ అధికారులు మొద్దు నిద్ర విడాలి:

సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలాభిండెల శ్రీనివాస్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) నిజాంపేట్ సర్కిల్ పరిధిలో మటన్, చికెన్ షాపులు ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయాలనీ సీపీఐ ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ ప్రజావాణిలో పిర్యాదు చేశారు. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలాభిండెల శ్రీనివాస్ మాట్లాడుతూ... నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని మటన్, చికెన్ ఆదివారం మిగిలిన మాంసాన్ని ఫ్రైజ్ లో పెట్టి తిరిగి సోమవారం షాప్ వారు అమ్ముతున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ నిర్వహించి ప్రజల ఆరోగ్యం మీద ప్రభావం పడకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన నిర్వహిస్తామని గుర్తు చేశారు. ఈకార్యక్రమం సీపీఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నాకంటే దస్తగిరి, కాట్రగడ్డ వాసు తదితరులు పాల్గొన్నారు.



దసరా..బతుకమ్మ వేళ పండుగ కానుకల సందడి

- మహిళలు, సిబ్బంది, ఆటో డ్రైవర్లకు మల్లేపల్లి లలిత సోమిరెడ్డి కానుకలు పంపిణీ..



పటాన్‌చేరు, అక్టోబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని పేద, మధ్యతరగతి కుటుంబాలతో పాటు వివిధ వర్గాల ప్రజల్లో పండుగ ఆనందాన్ని పంచేలా తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి ఆధ్వర్యంలో పండుగ కానుకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పండుగల వేళ ప్రజలతో ఆత్మీయ అనుబంధాన్ని పెంపొందించడంతో పాటు మహిళలు, మున్సిపల్ సిబ్బంది, ఆటో డ్రైవర్లకు కానుకలు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ నగర్ మొదటి, రెండో దశల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు, మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. అలాగే ఆటో డ్రైవర్లకు దుస్తులతో పాటు బహుమతులు అందజేశారు. పండుగల సందర్భంగా తమను గుర్తించి కానుకలు అందజేయడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం స్థానికంగా పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చింది.

ఈ సందర్భంగా మల్లేపల్లి లలిత సోమిరెడ్డి మాట్లాడుతూ, దసరా, బతుకమ్మ పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం, ఆత్మీయతను పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో సంతోషంగా పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలోని వివిధ వర్గాల ప్రజలతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజల మధ్య సామాజిక ఐక్యతను బలోపేతం చేసే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



గజ్వేల్‌లో బీజేపీకి బలమైన పునాది..

కష్టపడితే పదవులు ఖాయం!

- క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు పార్టీలో ఉన్నత అవకాశాలు

- బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

గజ్వేల్:అక్టోబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్‌లో బీజేపీకి బలమైన పునాది ఉందని,పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి,ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసే నాయకులు,కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపుతో పాటు ఉన్నత పదవులు పొందే అవకాశాలు ఉంటాయని బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్,మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు.పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తూ,ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తే రాజకీయంగా మరింత ఎదగవచ్చని పేర్కొన్నారు.

ధర్మారావుకు ఘన సన్మానం

గజ్వేల్‌లో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ నివాసంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పెర ప్రసాదరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో ధర్మారావు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

ప్రజాసేవే రాజకీయ ఎదుగుదలకు పునాది

ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ క్రమశిక్షణ,నిబద్ధత, ప్రజాసేవ రాజకీయాల్లో కీలకమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు,కార్యకర్తలకు సూచించారు.పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొని,పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్,బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్,రూరల్ మండల అధ్యక్షుడు అశోక్,జిల్లా కార్యదర్శి సురేష్,జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకట్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్,యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు అరవింద్ చారి తదితర స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాలనీల సమస్యలపై ఫోకస్..

బీరంగూడ కాలనీల సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి..



పటాన్‌చేరు, అక్టోబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

బీరంగూడ డివిజన్‌లోని బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీ, సూర్యోదయ కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన ఐఏఎస్‌ను కోరారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో కమిషనర్ పర్యటించిన సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, ఆయా కాలనీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో పాటు చేపట్టాల్సిన పనులపై వివరించారు.

స్థానికులు ఎదు ర్కొంటున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రాంత అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు..

గజ్వేల్ నూతన కోర్టు భవన నిర్మాణం వేగవంతం చేయాలి


- మార్చి నాటికి భవనం సిద్ధం కావాలి.. జిల్లా జడ్జి సుదర్శన్ ఆదేశం

- నిర్మాణ పనులను పరిశీలించి.. - కాంట్రాక్టర్, బిల్డింగ్ కమిటీకి స్పష్టమైన సూచనలు



గజ్వేల్:12 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్‌లో నిర్మాణంలో ఉన్న నూతన కోర్టు భవనాన్ని వచ్చే ఏడాది మార్చి నెలలోగా కచ్చితంగా పూర్తి చేసి అప్పగించాలని సిద్దిపేట జిల్లా జడ్జి సుదర్శన్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌తో పాటు బిల్డింగ్ కమిటీ సిబ్బందికి స్పష్టం చేశారు.సోమవారం ఆయన అదనపు జిల్లా జడ్జి జయరాంతో కలిసి కోర్టు భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేయాలని జిల్లా జడ్జి సూచించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి నూతన కోర్టు భవనం సిద్ధం చేసి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతి గౌడ్,అదనపు జూనియర్ సివిల్ జడ్జి మన్వీర్,గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ సాగర్ రావు, ఉపాధ్యక్షుడు పి.నరేష్ చారి, ప్రధాన కార్యదర్శి కె.కరుణాకర్,ఈసీ సభ్యులు రామకృష్ణ, గఫ్ఫార్ పాల్గొన్నారు.అలాగే న్యాయవాదులు కాళీ ప్రసాద్, పార్థసారథి, కనకయ్య,కోర్టు సూపరింటెండెంట్లు హనుమంత్ రెడ్డి, జ్యోతీందర్ నాథ్ రెడ్డి,రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్,ఏసీపీ నర్సింలు, సీఐ రవికుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





ఓటు చోరీ ఆరోపణలపై ఆధారాలు వెల్లడించాలి

- హుస్నాబాద్‌లో ఓట్ల తొలగింపుపై మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ చర్చకు సిద్ధమా?

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పెర ప్రసాదరావు ప్రశ్న

గజ్వేల్:12 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ఓటు చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు సంబంధించి స్పష్టమైన ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పెర ప్రసాదరావు కోరారు.ఏ పోలింగ్ బూత్‌లో ఎంతమంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి,వారిలో అర్హులైన ఓటర్లు ఎంతమంది ఉన్నారనే వివరాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.గజ్వేల్‌లో బీజేపీ నాయకులు ఓటర్ల జాబితాను పరిశీలించి,ఓట్ల తొలగింపునకు సంబంధించిన అంశాలపై నిజనిర్ధారణ చేపట్టినట్లు తెలిపారు.

హుస్నాబాద్ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా?

హుస్నాబాద్‌లో అర్హులైన ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలపై మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ చర్చకు సిద్ధమా అని కప్పెర ప్రసాదరావు ప్రశ్నించారు.ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్న నేపథ్యంలో,ఆ ఆరోపణలకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని పేర్కొన్న ఆయన,అర్హులైన ఓటర్లకు ఆ హక్కు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సంబంధిత అధికారులు పరిశీలన జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు సమయం,తేదీ నిర్ణయించాలని కాంగ్రెస్ నేతలు కోరే ముందు హుస్నాబాద్‌లో ఓట్ల తొలగింపుపై వస్తున్న ఆరోపణలకు స్పష్టత ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.ఏ ప్రాంతంలో ఎంతమంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి,వారిలో అర్హులైన ఓటర్లు ఎంతమంది ఉన్నారు అనే వివరాలను ఆధారాలతో వెల్లడించాలని కోరారు.ఓటర్ల జాబితాకు సంబంధించి రాజకీయ పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో,సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించుకోవడం ముఖ్యమని బీజేపీ నేతలు పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు అందేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్,గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, ములుగు మండల అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్,జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకట్ రెడ్డి, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ యువ మోర్చా అధ్యక్షుడు రాజేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత విగ్రహ ఏర్పాటుకు రూ.28,111 విరాళం

సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ ఔదార్యం

మెదక్ అక్టోబర్ 12(ప్రజాకలం ప్రతినిధి) దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం రెడ్డిపల్లి గ్రామంలో దుర్గామాత విగ్రహ ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ రూ.28,111 విరాళంగా అందించారు. అమ్మవారి పట్ల తనకున్న భక్తిని చాటుకుంటూ విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.గత ఏడాది నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి తొమ్మిది రోజుల పూజా కార్యక్రమాల్లో పద్మావతి అశోక్ గౌడ్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నట్లు తెలిపారు. ఆ సమయంలో సర్పంచ్‌గా విజయం సాధించాలని దుర్గామాతను మొక్కుకున్నానని, అమ్మవారి కృపతో తన కోరిక నెరవేరిందన్న విశ్వాసంతో ఈ ఏడాది విగ్రహ ఏర్పాటుకు విరాళం అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆశీస్సులతో రెడ్డిపల్లి గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. గ్రామంలో శాంతి, ఐకమత్యం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



20వ వార్డులో బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్

గజ్వేల్:12అక్టోబర్2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని అభివృద్ధి పనులు చేపట్టారు.పండుగల సందర్భంగా వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ శాఖ కేటాయించిన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.ఉత్సవాల నిర్వహణ,నిర్వహణా ఏర్పాట్ల కోసం మున్సిపాలిటీ కేటాయించిన రూ.లక్ష నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగలను వార్డు ప్రజలందరూ సంతోషంగా,ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకోవాలనే ఉద్దేశంతో మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పండుగలోపు వార్డులోని ప్రధాన రహదారుల మరమ్మతులు,సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.వార్డు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మున్సిపల్ యంత్రాంగం సహకారంతో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు ముఖ్య నాయకులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





ఢిల్లీలో జరిగిన భారీ నిరసన పాదయాత్ర లో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గ టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఏనుగు జంగారెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (ప్రజా కలం):

ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన పాదయాత్ర నిర్వహించారు.కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్రను చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఏనుగు జంగారెడ్డి సార్లపల్లి గ్రామ సర్పంచ్ ఇస్లావత్ శీను నాయక్ పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలో ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. ప్రస్తుత సీఈసీ వ్యవహారశైలి పక్షపాతంగా ఉందని ఆరోపిస్తూ, ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, ప్రజా గొంతుకను వినిపించేందుకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఢిల్లీ వేదికగా జరిగిన భారీ నిరసనలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం,అక్టోబర్ 11 (ప్రజా కలం):

రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున సంఘీభావం



తెలియజేసినట్లు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు.దేశ రాజధాని ఢిల్లీ వేదికగా నిర్వహించిన ఈ భారీ నిరసన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ముఖ్య నాయకులతో కలిసి రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాస్వామ్య సూత్రాలను, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ప్రజా గొంతుకను నొక్కే ఏ ప్రయత్నాన్నైనా ఐక్యంగా తిప్పికొడతామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటంలో అడుగులు ముందుకు వేస్తూ, భవిష్యత్తులోనూ ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తామని పిలుపునిచ్చారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య

కందుకూరు, అక్టోబర్ 12, (ప్రజా కలం)

బీసీలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేయాలని, దానిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య డిమాండ్ చేశారు.



సోమవారం కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో బీసీ హక్కుల సాధన సమితి మండల మహాసభ నిర్వహించారు.దీనికి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు అమలు కాకపోవడం వల్ల బీసీ యువత తీవ్రంగా నష్టపోతూ అన్యాయానికి గురవుతోందని యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కులగణనలో బీసీ గణన చేపట్టాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరును యాదయ్య తప్పుపట్టారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని.. దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా కేంద్ర ఎన్నికల సంఘాన్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా 11 మందితో కందుకూరు మండల బీసీ హక్కుల సాధన సమితి నూతన కమిటీని పల్నాటి యాదయ్య ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా మార్చ నర్సింహా , ప్రధాన కార్యదర్శిగా జాల హరిబాబు ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల రాములు, సహాయ కార్యదర్శి చిప్పలపల్లి రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎం అంజయ్య, వత్తుల నర్సింహా, ఆర్ రమేశ్ ఆపాయింట్ అయ్యారు

మహేశ్వరంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భారీ విరాళం

- మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్

- సంగమేశ్వర ఆలయ సన్నిధిలో స్లాబ్ పనులు ప్రారంభం -పూర్తి ఖర్చు భరిస్తామన్న దాతలు



మహేశ్వరం,
అక్టోబర్ 12 (ప్రజా కలం):

మహేశ్వరం మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి దేవాలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ స్లాబ్ పనులు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ స్లాబ్ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును మాన్సాన్‌పల్లి గ్రామ సర్పంచ్ వట్టేలా పుష్పమ్మ, మాన్సాన్‌వల్లి మాజీ సర్పంచ్ మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్ దంపతులు భరించేందుకు ముందుకు రావడం విశేషం.

ఈ సందర్భంగా వట్టేలా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. మహేశ్వరం మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయి భక్తులకు అందుబాటులోకి వస్తే మండలంలోని అయ్యప్ప భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. శబరిమలకు వెళ్లలేని భక్తులు సైతం ఇక్కడే అయ్యప్పస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, అయ్యప్ప దీక్షలు చేపట్టే స్వాములు దీక్షా సమయంలో ఇక్కడే బస చేసేందుకు అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. భక్తి భావంతో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఆలయ స్లాబ్ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును తాము భరించేందుకు ముందుకు రావడం పట్ల స్థానికులు, అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శివగంగా దేవాలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ జోరాల రమేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య, శ్రీశైలం, వీరేశం పంతులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చెరువులు, కుంటల పునరుద్ధరణతో నీటి ఎద్దడిని నివారించాలి.

బహుజన బతుకమ్మ కరపత్రం విడుదల.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 12.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రకృతి పరిరక్షణ, సామాజిక సమానత్వానికి ప్రతిబింబంగా జరుపుకోవాలని అరుణోదయ సాంస్కృతిక సమైక్య కో ఆర్డినేటర్ తుడం స్వామి పిలుపునిచ్చారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో బహుజన బతుకమ్మ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "బహుజన బతుకమ్మ ఒక సాంస్కృతిక ఉద్యమం" అనే నినాదంతో ప్రజా సమస్యలపై చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు చెరువులు, కుంటలను పునరుద్ధరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అవినీతి, నిరుద్యోగం, అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాడుతున్న యువతకు సంఘీభావంగా నిలవాలని, విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్ తదితర దేశాలపై సాగిస్తున్న యుద్ధాలను ఖండిస్తూ, యుద్ధాల వల్ల ఏర్పడుతున్న సంక్షోభాలను నివారించేందుకు ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఆందోళన

ఓటర్లకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం: లక్ష్మీకాంత్ రెడ్డి

మల్కాజిగిరి, అక్టోబరు 12 (ప్రజా కలం ప్రతినిధి):

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల తొలగింపును నిరసిస్తూ మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఓట్ల తొలగింపుపై తమ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఓట్ల తొలగింపునకు గురైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, వాటికి బాధ్యత వహించి కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ పిలుపు మేరకు మధ్యాహ్నం 3 గంటలకు దేశవ్యాప్తంగా ప్రజలు ఎక్కడివారు అక్కడే జాతీయ జెండాలు, పార్టీ జెండాలు, కాంగ్రెస్ కండువాలతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరినట్లు వివరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ఓటు హక్కు కాపాడేందుకు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

బుధవారం గాంధీ పార్కులో నిరసన

మల్కాజిగిరి నియోజకవర్గ స్థాయిలో బుధవారం గాంధీ పార్కులో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, గుండా నిరంజన్, జీఎన్‌వీ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, ఏకే మురుగేష్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, వైనాల ప్రవీణ్, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, శ్రీకాంత్ ముదిరాజ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, చెన్నారెడ్డి, పార్థు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్ జిత్ గౌడ్, ఆశా, చిత్ర, గోకుల్, శారద, పుష్పలత, కనకలక్ష్మి, లక్ష్మి, సయ్యద్ మబ్బు, బ్రహ్మయ్య, రామకృష్ణ, రాము, చుంకు శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో జరిగిన భారీ నిరసన పాదయాత్ర లో పాల్గొన్న సార్లరావులపల్లి గ్రామ సర్పంచ్ ఇస్లావత్ శీను నాయక్

కందుకూరు , అక్టోబర్ 12 (ప్రజా కలం):

ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన పాదయాత్ర నిర్వహించారు.కేంద్ర ఎన్నికల



కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్రను చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఏనుగు జంగారెడ్డి సార్లపల్లి గ్రామ సర్పంచ్ ఇస్లావత్ శీను నాయక్ పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలో ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. ప్రస్తుత సీఈసీ వ్యవహారశైలి పక్షపాతంగా ఉందని ఆరోపిస్తూ, ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, ప్రజా గొంతుకను వినిపించేందుకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మహేశ్వరం గ్రామ మంచినీటి ట్యాంకుల స్థలంపై సమగ్ర విచారణ జరపాలి

- బీజేపీ మహేశ్వరం మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్

మహేశ్వరం, అక్టోబర్ 12, (ప్రజా కలం)

మహేశ్వరం గ్రామంలోని కల్లు కాంపౌండ్ వెనుక భాగంలో గ్రామ ప్రజలకు మంచినీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకుల స్థలానికి సంబంధించి సమగ్ర విచారణ జరపాలని బీజేపీ మహేశ్వరం మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు, మహేశ్వరం మండల ఎమ్మార్వో గారికి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత సుమారు 50 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో మంచినీటి ట్యాంకులు కొనసాగుతూ గ్రామ ప్రజలకు నీటి సరఫరా జరుగుతోందన్నారు. ఈ స్థలానికి సంబంధించిన సర్వే నంబరు, యాజమాన్య వివరాలు, పాత మరియు ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, అధికారిక సర్వే ద్వారా హద్దులను నిర్ధారించాలని కోరారు.గతంలో గ్రామసభలో ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదన్నారు. సదరు స్థలం తమదని కొందరు వ్యక్తులు పత్రాలు చూపిస్తూ అక్కడ ఉన్న ప్రహరీ గోడను తొలగించారని తన దృష్టికి వచ్చిందని, దీనిపై రికార్డుల ఆధారంగా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. ఒకవేళ ఈ స్థలం శ్మశానవాటిక లేదా కబరస్తాన్‌గా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంటే, ఆ నమోదు ఎప్పుడు, ఏ ఆధారాలతో జరిగిందో స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ట్యాంకుల ప్రాంగణంలో అపరిశుభ్రతపై ఆందోళన

వాటర్ ట్యాంకుల ప్రాంగణంలో ఖాళీ బీర్ బాటిళ్లు, మద్యం సీసాలు, చెత్తాచెదారం పేరుకుపోయిందని, ప్రహరీ గోడ లేకపోవడంతో దుర్వాసన, దోమల వ్యాప్తి వంటి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని శ్రవణ్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే స్థలాన్ని సందర్శించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, చట్టపరంగా ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి పాండు నాయక్, సీనియర్ నాయకులు పంతులు, భీమనపల్లి రాజేష్ తదితరులు పాల్గొని, మంచినీటి ట్యాంకుల స్థల సమస్యను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించి ప్రజా ప్రయోజనాలను కాపాడాలని కోరారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి

-రూ.26 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, అక్టోబరు 12 (ప్రజా కలం ప్రతినిధి):

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. కాప్రా సర్కిల్



పరిధిలోని కుషాయిగూడ డివిజన్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కాలనీలో రూ. 26 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడంతో పాటు కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, ఆర్‌సీసీ పైప్‌లైన్లు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.
సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే కాలనీ వాసుల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ మాజీ అధ్యక్షుడు భరత్ సాగర్, అధ్యక్షుడు జె. సుధాకర్, కార్యదర్శి అఖిల్, కాలనీ వాసులు బి. కృష్ణ, కనకయ్య, పరమేష్, ఎస్. కృష్ణ, రాజేష్, దామోదర్, మల్లేష్, మాదేశ్, మహిళలు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల కొరడా!

- బౌరంపేటలో 8 బేస్‌మెంట్లు, 2 గదులు కూల్చివేత





ప్రజాకలం/కుత్బుల్లాపూర్: ప్రభుత్వ రెవెన్యూ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝళిపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ సర్కిల్ (59) బౌరంపేట గ్రామంలో సర్వే నంబర్లు 578, 580 పరిధిలో ఇటీవల అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నట్లు గుర్తించారు.

ఈ నేపథ్యంలో దుండిగల్ తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యల్లో భాగంగా ఎనిమిది బేస్‌మెంట్లు, రెండు గదులను తొలగించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

ప్రభుత్వ రెవెన్యూ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిపై భూ ఆక్రమణ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని సూచించారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో వీఆర్వో ప్రకాశ్, వీఆర్ఏలు జితేందర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసుల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోకుంటే లోకాయుక్తను ఆశ్రయిస్తాం-ఆకుల సతీష్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) మల్లంపేట +ూూ కాలనీలో సర్వే నంబర్లు 170/1, 170/3, 170/4, 170/5లో అక్రమ నిర్మాణాలపై 05.05.2026న జారీ చేసిన ఎనిమిది షోకాజ్ నోటీసుల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని దుండిగల్ సర్కిల్--59 డిప్యూటీ కమిషనర్‌ను కోరుతూ ఆయన ఫిర్యాదు అందజేశారు. 12.05.2026న నిర్వహించాల్సిన విచారణపై ఇప్పటి వరకు ఎలాంటి తుది చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని, అక్రమ నిర్మాణాలను నిలిపివేసి బాధ్యులైన అధికారులపై విచారణ జరపాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా తక్షణమే చట్టపరమైన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో పూర్తి ఆధారాలతో తెలంగాణ లోకాయుక్తను ఆశ్రయిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆకుల సతీష్, అమలేశ్వరి, కృష్ణారెడ్డి, అంకం సతీష్ హెచ్చరించారు.







సీఈసీపై కాంగ్రెస్ సమరభేరి

- జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు నీలం మధు డిమాండ్.. ఢిల్లీలో నిరసన మార్చ్..



పటాన్‌చేరు, అక్టోబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో నిర్వహించిన భారీ నిరసన ప్రదర్శనలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. బారాఖంబా జంక్షన్ నుంచి సుప్రీంకోర్టు వరకు సాగిన నిరసన మార్చ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తదితర నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘం వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధ బాధ్యతలను విస్మరిస్తోందని విమర్శించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటంలో తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు మూర్తి స్థాయిలో భాగస్వాములవుతాయని తెలిపారు. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, ఓటర్ల జాబితాలను పునరుద్ధరించే వరకు ఢిల్లీ నుంచి గ్రామస్థాయి వరకు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు..



పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

-జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్

యాదాద్రి అక్టోబర్ 12 ప్రజాకలం:పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, న్యాయమైన దర్యాప్తుతో బాధితులకు సత్వర న్యాయం అందించాలని,యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ అన్నారు.సోమవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ లో యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల నెలవారీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌ను జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ,డీఎస్పీలు, సీఐలు,ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు,టెక్నికల్ టీమ్, సీసీఎస్,సైబర్ క్రైమ్,డీసీఆర్‌బీ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ నెల వరకు నమోదైన



కేసులు,పెండింగ్‌లో ఉన్న కేసులు,పురోగతిని డివిజన్ల వారీగా సమీక్షించారు. ముఖ్యంగా పోక్సో,వరకట్న వేధింపులు,హత్య కేసులు వంటి తీవ్రమైన కేసుల దర్యాప్తుపై,ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకొని, సమర్థవంతమైన దర్యాప్తుతో వీలైనంత త్వరగా పరిష్కరించాలని, అధికారులను ఆదేశించారు.కేసుల ఛేదనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, సాక్ష్యాధారాల సేకరణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రతి డివిజన్‌లో పెండింగ్ కేసుల పురోగతిని డీఎస్పీలు నిరంతరం పర్యవేక్షిస్తూ,సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించాలని, ఆదేశించారు.ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ,కేసుల దర్యాప్తులో నాణ్యతను పెంచాలని జిల్లా ఎస్పీ సూచించారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం జర్నలిస్టుల కృషి



సికింద్రాబాద్, అక్టోబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి)

బోయిగూడలోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 8,9,10 తరగతులకు అనుమతి మంజూరు చేయాలని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఈ.చంద్రశేఖర్ (సాక్షి), ప్రధాన కార్యదర్శి బి. నర్సింగరావు (నమస్తే తెలంగాణ) కోరారు.

ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా (ఐఏఎస్) ను సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆమె ఛాంబర్ కలిసి మేకలమండి పాఠశాలను పదో తరగతి వరకు అప్ గ్రేడ్ చేయాలని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కె.సీతా దయాకర్ రెడ్డి లు ఇచ్చిన సిఫారసు లేఖలను వారు ఆమెకు అందజేశారు.

ఎక్కువమంది పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలను అప్ గ్రేడ్ చేయాలని చంద్రశేఖర్ కోరగా డాక్టర్ యోగితా రాణ సానుకూలంగా స్పందించారు. తప్పకుండా పరిశీలించి వీలైనంత త్వరగా అనుమతి మంజూరు చేసేందుకు శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.
పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కే మల్లికార్జున్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. స్వరూప, టీచ్ ఫర్ ఇండియా టీచర్ హిమబిందు పాల్గొన్నారు.

మౌలిక వసతుల అభివృద్ధితో కాలనీల్లో మరింత మెరుగైన అభివృద్ధి

ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 132 – జీడిమెట్ల ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేజ్ – 1లో దాదాపు 6.70లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న త్రాగునీటి సరఫరా పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, జీడిమెట్ల డివిజన్ లోని అన్నీ బస్తీల్లో గత పన్నండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పరుస్తామన్నారు.
ఈకార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్, కాలనీ అధ్యక్షులు సంపత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సంయుక్త సహాయ కార్యదర్శి పరమేశ్వర్ గౌడ్, కోశాధికారి కరుణాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి, విజయ్, కమిటీ సభ్యులు శివకుమార్, బాపిరెడ్డి, నాగేశ్వర్ రావు, కాశీనాథ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యరామ్, వినోద్ రెడ్డి, వెంకటేష్, ఎల్లాగౌడ్, కాలనీ వాసులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి...:బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్
132 – జీడిమెట్ల డివిజన్ వెస్ట్ ఎం.ఎన్.రెడ్డి నగర్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా అసంపూర్ణంగా



నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ విషయంపై కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.
ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.
ఈకార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, చీఫ్ అడ్వైసర్ రాముడు యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి క్రిష్ణ పటేల్, కోశాధికారి రాజు, కాలనీ యూత్ అధ్యక్షులు రాజు యాదవ్, కాలనీ వాసులు మురళి, బస్వరాజు, శేఖర్ గౌడ్, నర్సింహ, క్రిష్ణ, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com